తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

మెదక్ - మహబూబ్‌నగర్

సంగారెడ్డి | సిద్దిపేట

జోగులాంబ గద్వాల

వనపర్తి | నారాయణపేట


నాగర్ కర్నూల్

శుక్రవారం

11 సెప్టెంబర్ 2026

## కల్లు మామూళ్ల పంపకాల ఖాతాల్లో నేతలు, కుల సంఘాలు..!







**బిజినేపల్లి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** కల్లు తయారీ నిర్వాహకుల వద్ద నేతలు, కుల సంఘాలు మామూళ్ల వసూళ్లు చేసుకుంటున్నారని అనుకుంటే పప్పులో కాలేసినట్టే. కల్లు మామూళ్ల ఖాతా లెక్కల్లో ఆయా పార్టీ నేతలకు, కుల సంఘాల నాయకులకు, విలేఖరుల పేర్ల మీద పంపకాలు చేసినట్లుగా ఒక నేత కల్లు వ్యాపారికి చూపిన లెక్కల్లో ఈ తతంగం వెలుగు చూసింది. కానీ విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. మండలంలో ఆయా గ్రామాలకు కల్లు సరఫరా చేసే ఒక వ్యాపారి అనుకోకుండా తన వ్యాపారానికి దూరమై కొన్ని నెలల పాటు అజ్ఞాతంలోకి వెళ్లి పోయాడు. తాను వచ్చే వరకు కల్లు బాధ్యతలు నువ్వే నిర్వహించు అని మండలానికి చెందిన ఒక కీలక నేతకు అప్పగించి వెళ్ళాడు. ఆ నేత కూడా కల్లు వ్యాపారంలో ఎలాంటి ఆటంకాలు, అవరోధాలు లేకుండా తన బాధ్యతను నిర్వహించాడు. కొద్ది నెలల తర్వాత అజ్ఞాతవాసం నుండి తిరిగి వచ్చిన ఆ వ్యాపారికి ఈ నేత కల్లు మామూళ్ల లెక్కలు తీసి వివరించాడు. ఖాతాల్లో అన్ని పద్దులు బాగానే ఉన్నప్పటికీ ఆ వ్యాపారికి ఒక పద్దును చూసి షాక్ కు గురయ్యాడు.

ఆ పద్దు ఏమి అనుకుంటున్నారా..?

ఆ పద్దు మరేదో కాదు. ఆయా పార్టీల నేతలకు, కుల సంఘాల నాయకులకు, విలేకరులకు దాదాపు రూ.20 లక్షలు ఇచ్చినట్లుగా వ్రాశాడు. కానీ వాటిల్లో ఒక నేతకు కానీ, కుల సంఘానికి కానీ, విలేఖరికి గాని రూపాయి కూడా ఇవ్వలేదని తేలింది. లెక్కల్లో మాత్రం వీరందరికీ పంపకాలు చేసినట్లుగా పద్దులో రూ.20 లక్షలు చూపించాడు. తాను వ్యాపారం నిర్వహించినప్పుడు దాన ధర్మాల



పేరుతో మూడు నుంచి నాలుగు లక్షల వరకు మాత్రమే ఖర్చులు అయ్యేదని, తాను వ్యాపార బాధ్యతలు నిర్వహించే సమయంలో ఇలాంటి పంపకాలు ఏవీ లేవని తన సన్నిహితులతో కన్నీటి పర్యంతం అయ్యాడు. తనకు కష్టకాలం వచ్చి కల్లు నిర్వహణ బాధ్యతలు ఆ నేతకు నమ్మకంతో అప్పగిస్తే కనికరం లేకుండా తనను నిండా ముంచాడని వాపోయాడు.

ఆ నేత ఎవరు ?

ఇలా తప్పుడు పద్దులతో అందరి దృష్టిలో పడ్డ ఆ నేత ఎవరని మండల నేతల్లో, కుల సంఘాల నాయకుల్లో తీవ్రమైన చర్చ జరుగుతుంది. లేని ఆరోపణలు తమపై వేసిన ఆ నేతకు అధికార పార్టీ నాయకుడి అండదండలు ఉండటంతో ప్రశ్నించడానికి కొందరు జంకుతున్నారు.

## నర్సింగ్ కళాశాల నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయాలి

- **జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక**

నారాయణపేట జిల్లా బ్యూరో సెప్టెంబర్10 (జనం సాక్షి):నర్సింగ్ కళాశాల నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక తెలిపారు. గురువారం నారాయణపేట నర్సింగ్ కళాశాల, హాస్టల్ ను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. కళాశాల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కిచెన్, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. కళాశాల కాంపౌండ్ వాల్ నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. పది రోజులలో పనులు పూర్తిచేసి భవనాలు అప్పగించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ



కార్యక్రమంలో మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ సంపత్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా గణేష్ విగ్రహాల అమ్మకాలు..

- **చవితికి ముస్తాబవుతున్న పల్లెలు..భక్తిశ్రద్ధలతో గణేశ్ ఉత్సవాలకు సన్నాహాలు**



**మహమ్మదాబాద్,సెప్టెంబర్ 10(జనంసాక్షి):** ఈనెల 14న జరగనున్న వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని,మండల కేంద్రంలో గణనాథుల విగ్రహాల కొనుగోళ్లు జోరందుకున్నాయి.విఘ్నేశ్వరుడి దర్శనం కోసం యువత ఉత్సాహంగా ముందుకు వస్తుండటంతో విగ్రహాల విక్రయ కేంద్రాలు సందడిగా మారాయి.వివిధ ఆకృతులు,రంగురంగుల అలంకరణలతో కొలువుదీరిన గణపతి విగ్రహాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి పల్లెలో 'గణపతి బప్పా మోరియా'అంటూ భక్తజనం గణనాథుడిని కొలిచేందుకు సిద్ధమవుతున్నారు.గ్రామాల్లో యువకులు,భక్తులు,వివిధ సంఘాల ఆధ్వర్యంలో విగ్రహాలను ప్రతిష్ఠించి తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడిని కొలిస్తే సకల శుభాలు కలుగుతాయన్న విశ్వాసంతో భక్తులు గణనాథుడి విగ్రహాలను తమకు నచ్చిన రీతిలో ఎంపిక చేసుకుంటున్నారు.వినాయకుడి నామస్మరణతో పల్లెల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంటోంది.గణేశ్ విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తున్న వ్యాపారులు సైతం ఈసారి కొనుగోళ్లు ఆశాజనకంగా సాగుతున్నాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు.చవితి సమీపిస్తుండటంతో రానున్న రోజుల్లో విక్రయాలు మరింత ఊపందుకుంటాయని వారు పేర్కొంటున్నారు.


**రూ.20 లక్షలతో గణేష్ విగ్రహాలు అమ్ముటకు పెట్టుబడి..**

మహమ్మదాబాద్ మండల పరిధిలోని నంచర్ల గేట్ వద్ద శ్రీసాయి బైక్ పాయింట్ పక్కన రూ.20,లక్షల పెట్టుబడితో గణేష్ విగ్రహాల అమ్ముటకు నంచర్ల గ్రామానికి చెందిన వ్యాపారస్తుడు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.వినాయక చవితి నేపథ్యంలో విగ్రహాలకు మంచి డిమాండ్ ఉండటంతో ఇప్ప టికే సుమారు 50,శాతం బుకింగ్ పూర్తయినట్లు వ్యాపా రస్తుడు తెలిపారు.దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఉమ్మడి మండలాలు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు స్థానికంగానే విగ్రహాలు అందుబాటులో ఉండేలా ఈవ్యాపారం ప్రారం భించినట్లు చెప్పారు.ఈఏడాది విక్రయాలు ఆశాజనకంగా ఉండి ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు.



**– గణేష్ విగ్రహాల వ్యాపారస్తుడు కుమ్మరి,అంజిలయ్య,**

## రాజ్యాలు పోయినా వీడని శ్రీవారి బంధం.. గద్వాల ఏరువాడ జోడు పంచెల వైభవం



**గద్వాల, ప్రతినిధి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** రాజ్యాలు అంతరించినా, గద్వాల సంస్థానానికి తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారితో ఉన్న ఆధ్యాత్మిక అనుబంధం మాత్రం నేటికీ కొనసాగుతోంది. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా తెలంగాణ నుంచి సమర్పించే విశిష్ట పవిత్ర కానుకగా పేరొందిన గద్వాల 'ఏరువాడ జోడు పంచెలు' తయారీ పూర్తయి తిరుమలకు చేరు కున్నాయి. సుమారు 400 ఏళ్లుగా గద్వాల సంస్థానాధీశుల వారసులు ఈ సంప్రదాయాన్ని భక్తిశ్రద్ధలతో కొనసాగిస్తున్నారు.

**41 రోజుల దీక్షతో పవిత్ర నేత...**

ఏరువాడ జోడు పంచెల తయారీ సాధారణ వస్త్రనేత కాదు.. ఒక ఆధ్యాత్మిక క్రతువు. గద్వాలలోని మలికంటి చేనేత వంశానికి చెందిన నైపుణ్యం కలిగిన కళాకారులు సుమారు 41 రోజులపాటు కఠిన నియమాలు పాటిస్తూ, గోవింద నామస్మరణతో ప్రత్యేక మగ్గంపై పంచెలను నేస్తారు. ఎలాంటి అపవిత్రత దరిచేరకుండా అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ వస్త్రాలను రూపొందిస్తారు.

ఈ పంచెలకు 'ఏరువాడ పంచెలు' లేదా 'శేష వస్త్రాలు' అనే పేర్లు ఉన్నాయి. కృష్ణా, తుంగభద్ర నదుల మధ్య ప్రాంతమైన గద్వాల నుంచి తిరుమలకు చేరడం వల్ల 'ఏరువాడ' అనే పేరు వచ్చినట్లు చెబుతారు. ఒక్కో పంచె 11 గజాల పొడవు, రెండున్నర గజాల వెడల్పుతో ఉంటుంది. 15 అంగుళాల వెడల్పు పట్టు అంచుతో రూపొందించి, సహజసిద్ధమైన పసుపు, మెరూన్ రంగులతో అలంకరిస్తారు. పత్తిని చీరాల నుంచి, పట్టును బెంగళూరు నుంచి సేకరిస్తారు. స్వామివారి నామాలు, కంచుకోట నగిషీలను చేతితోనే నేస్తారు.

**బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక ప్రాధాన్యత...**

ఏరువాడ పంచెలు తిరుమలకు చేరుకున్న అనంతరం ప్రధాన అర్చకులు "స్వామి.. ఏరువాడ జోడు పంచెలు అందాయి" అని స్వామివారి చెవిలో నివేదించే సంప్రదాయం ఉంది. ఈ ఘట్టం అనంతరం బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని విశ్వాసం. బ్రహ్మోత్సవాల తొలి రోజు రాత్రి జరిగే పెద్ద శేష వాహన సేవలో మూలవిరాట్టుకు ధోవతిగా, కండువాగా ఈ పంచెలనే అలంకరిస్తారు.

**గద్వాల చేనేతకు ప్రత్యేక గుర్తింపు...**

గద్వాల చేనేతకు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. గద్వాల వస్త్రాల ప్రత్యేక నేతశైలికి కేంద్ర ప్రభుత్వం భౌగోళిక గుర్తింపు (జీఐ) అందించింది. కాటన్ మధ్యభాగంతో పాటు పట్టు, జరీ అంచులను మగ్గంపైనే 'కుట్టు' లేదా 'ఇంటర్లాకింగ్' సాంకేతికతతో అనుసంధానించడం వీటి ప్రత్యేకత. గద్వాల చీరను మడతపెడితే అగ్గిపెట్టెలో పట్టేంత సూక్ష్మంగా మారే నైపుణ్యం చేనేత కళాకారుల ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తోంది.

400 ఏళ్ల చారిత్రాత్మక సంప్రదాయాన్ని గద్వాల సంస్థాన వారసులు, చేనేత




కళాకారులు కొనసాగిస్తూ ఉండటంపై భక్తులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ చేనేత నైపుణ్యం, ఆధ్యాత్మిక విశ్వాసం, గద్వాల సంస్థాన చారిత్రక వారసత్వానికి ఏరువాడ జోడు పంచెలు ప్రతీకగా నిలుస్తున్నాయి.

# భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఐలమ్మ పోరాటం: జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషాషేక్

- **ఐలమ్మ స్ఫూర్తిని కొనసాగించడమే నిజమైన నివాళి**



**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 10(జనంసాక్షి);** భూమి కోసం, భుక్తి కోసం భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన చాకలి ఐలమ్మ స్ఫూర్తిని కొనసాగించడమే ఆమెకు నిజమైన నివాళి అని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్ వద్ద బిసి అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి కలెక్టర్ తో పాటు ఇతర అధికారులు, రజక సంఘం నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1940వ దశకంలో తెలంగాణలో జరిగిన సాయుధ పోరాటంలో ఐలమ్మ ధైర్య సాహసాలు ప్రతి ఒక్కరికి స్ఫూర్తినిస్తాయన్నారు. అప్పుడు పోరాటం చేసిన వారిలో ఐలమ్మ లాంటి చాలా కొద్ది మంది మహిళలు ఉన్నప్పటికీ ఆర్మీ లాంటి గేరిల్ల దళాలను ఏర్పాటు చేసి దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పని చేశారన్నారు. ఐలమ్మ జీవిత చరిత్ర భవిష్యత్తు తరాలకు కూడా స్ఫూర్తిగా నిలవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆమె జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. తెలంగాణ సమాజానికి ఐలమ్మ చేసిన సేవలకు గుర్తుగా కోఠి ఉమెన్స్ కాలేజీకి ఆమె పేరును పెట్టడం జరిగిందని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.అనంతరం పలువురు వక్తలు కూడా మాట్లాడుతూ ఐలమ్మ ఘనతలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి, బీసీ అభివృద్ధి శాఖ అధికారి అక్బర్ పాషా, బీసీ, రజక సంఘాల నేతలు, పలువురు జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆశ కార్యకర్తల... సమీక్ష సమావేశం




**పెబ్బేరు, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు నెలవారి ఆశ సమీక్ష సమావేశము నిర్వహించారు. ప్రాథమిక వైద్యాధికారిణి నందియా మాట్లాడుతూ, ఎఎన్సీ రిజిస్ట్రేషన్, ప్రతి గర్భిణీ స్త్రీ దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెలివరీ ప్లానింగ్ చేసుకోవాలని, అలాగే ఎన్ సి డి లో స్క్రీనింగ్ మరియు ఫాలోఅప్ లు అప్డేట్ చేయాలని తెలియజేశారు ఆల్ నేషనల్ ప్రోగ్రాం ప్రతి రిపోర్టు ఏరోజుకారోజు అప్డేట్ చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మీనా డాక్టర్ చంద్ర శేఖర్, వినీల, ఆరోగ్య విస్తరణ అధికారి దామోదర్, జనా లీలమ్మ, హెల్త్ సూపర్వైజర్ పార్వతి, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, తిరుపతయ్య, డాటా ఎంట్రీ ఆపరేటర్ రాజేష్ గౌడ్, ఫార్మ్ ఆఫీసర్ కుమారి మరియు ూచీవీ లు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# వేరుశనగ సాగులో శాస్త్రీయ పద్ధతులు పాటించాలి

- **బ్రీడర్ విత్తనాలతో అధిక దిగుబడులు సాధించాలి**
- **ఉప్పునుంతల పీఏసీఎస్‌లో పాలెం శాస్త్రవేత్తల అవగాహన**





**ఉప్పునుంతల, సెప్టెంబర్ 10 (జనం సాక్షి):** వేరుశనగ సాగులో రైతులు శాస్త్రీయ పద్ధతులు పాటించి నాణ్యమైన విత్తనాలను వినియోగిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని పాలెం పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు సూచించారు. ఉప్పునుంతల మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో గురువారం బ్రీడర్ విత్తనాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాలెం పరిశోధనా కేంద్రంతో పాటు వివిధ రాష్ట్రాల వ్యవసాయ విశ్వవిద్యాలయాలకు చెందిన శాస్త్రవేత్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మండలంలోని ఎంపిక చేసిన ప్రగతిశీల రైతులకు వేరుశనగ బ్రీడర్ విత్తనాలను శాస్త్రవేత్తలు అందించారు. ఈ విత్తనాలతో సాగు చేసిన పంటను కోత అనంతరం పాలెం పరిశోధనా కేంద్రం ద్వారా తిరిగి కొనుగోలు చేస్తామని తెలిపారు. పంట కాలంలో పాటించాల్సిన సాగు పద్ధతులు, ఎరువుల వినియోగం, తెగుళ్ల నివారణ, పంట యాజమాన్యంపై ఎప్పటికప్పుడు సూచనలు అందిస్తామని పేర్కొన్నారు. వేరుశనగతో పాటు ఇతర పంటల్లోనూ శాస్త్రీయ సాగు విధానాలను పాటించడం ద్వారా ఖర్చులు తగ్గించుకుని నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని వివరించారు.

ఉప్పునుంతల పీఏసీఎస్ అధ్యక్షుడు మద్దు నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ మండలాన్ని ఉత్తమ విత్తన కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. పీఏసీఎస్, పాలెం పరిశోధనా కేంద్రం సహకారంతో రైతులకు నాణ్యమైన విత్తనాలు, శాస్త్రీయ సాగుపై నిరంతరం అవగాహన కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతగాళ్ల శ్రీనివాసులు, కర్నె లక్ష్మీనారాయణ, పద్మారెడ్డి, లింగమయ్య, శ్రీనివాస్‌రెడ్డి, నరసింహారావు, బక్కయ్య, ఆంజనేయులు, జంగయ్య, అచ్యుతరెడ్డి తదితర రైతులు పాల్గొన్నారు.

# నియోజకవర్గం అభివృద్ధి కోసం సిఎంని కలిసిన ఎమ్మెల్యే డా చిట్టెం పర్ణికరెడ్డి



**నారాయణపేట జిల్లా బ్యూరో సెప్టెంబర్ 10(జనంసాక్షి):** అసెంబ్లీ లో గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని నారాయణపేట ఎమ్మెల్యే డా చిట్టెం పర్ణిక రెడ్డి కలిసి అభివృద్ధికి కృషి చేయాలని విన్నవించారు. మరికల్ మండలానికి జూనియర్ కాలేజీ,నారాయణపేట పట్టణంలోని శిథిలావస్థలో ఉన్న జూనియర్ కాలేజీ నూతన భవనం మంజూరు చేయాలని,నారాయణపేట పట్టణానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం మంజూరు, నూతన ఎస్పీ కార్యాలయం భవనం మంజూరు,దామరగిద్ద సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ కు నూతన భవనం మంజూరు కోసం ప్రతిపాదించారు. ప్రతిపాదనలకు సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి తప్పకుండా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారన్నారు.

# పేటలో ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి...



**పెద్ద శంకరంపేట్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** పెద్ద శంకరంపేటలో రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం చాకలి ఐలమ్మ వర్ధంతి జరుపుకున్నారు. పెద్ద శంకరం పేట పట్టణ శివారులోని తిరుమలాపూర్ చెరువు కట్ట వద్ద ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి రజక సంఘం బాధ్యులు. ఈ కార్యక్రమంలో పేట మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్ ఎన్ సంతోష్ కుమార్ . సుభాష్ గౌడ్. రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చాకలి నారాయణ. మండల అధ్యక్షుడు చాకలి ప్రభు బాధ్యులు కిష్టయ్య సాయి.. దస్తయ్య. సాయిలు తదితరులు పాల్గొన్నారు..

# కృత్రిమ మేధస్సు నేర్చుకుందాం.. భవిష్యత్తును గెలుచుకుందాం



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** భవిష్యత్తులో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే యువత కృత్రిమ మేధస్సు (ఏఐ)పై అవగాహన పెంచుకోవాలని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు. గోపిరెడ్డి జైపాల్‌రెడ్డి స్మారకార్థం సత్య సోదక్ సమతా సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 30 రోజుల ఉచిత ఏఐ శిక్షణను వనపర్తిలో ప్రారంభించారు. గ్రామీణ యువత కూడా ప్రపంచస్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకోవాలని సూచించారు. శిక్షణతో నెలకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు ఆదాయం పొందే అవకాశాలున్నాయని తెలిపారు. శిక్షణ అనంతరం ధ్రువపత్రంతో పాటు ఉపాధి మార్గదర్శకత్వం అందిస్తామన్నారు. కార్యక్రమంలో సునీల్‌రెడ్డి, కిరణ్‌సాగర్, శిక్షకుడు కిరణ్, యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

# శుద్ధీకరణ ఘటనపై పోలీసులకు కాంగ్రెస్ ఫిర్యాదు




**కృష్ణ, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** ఎర్రవెల్లి ఫార్మ్‌హౌస్ వద్ద కాంగ్రెస్ నాయకులు, దళిత మిత్రులు డప్పు సప్పుడులతో నిర్వహించిన నిరసన స్థలాన్ని బీఆర్ఎస్ నాయకులు పసుపు నీళ్లతో శుద్ధీకరణ చేయడాన్ని కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు.

ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కృష్ణ మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం పోలీస్ స్టేషన్‌లో ఎస్సై నవీద్‌కు ఫిర్యాదు చేశారు. దళితులను అవమానించే చర్యలను సహించబోమని నాయకులు పేర్కొన్నారు.

కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విజప్ప గౌడ మాలిపాటిల్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ సర్ఫరాజ్, పల్లా రాజేష్, పల్లె సురేష్, అన్వర్, లింగప్ప, నాగప్ప, రాకేష్, సంతోష్ పాటిల్, శంకర్ గౌడ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సృజన.. ప్రకృతికి రక్షణ




**కల్వకుర్తి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, నైపుణ్యాలను ప్రోత్సహించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీపాద శార్వాణి అన్నారు. రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు సహజ సిద్ధమైన, పర్యావరణహిత వస్తువులతో వినూత్న ఆవిష్కరణలు రూపొందించారు. ప్రతిభ కనబరిచిన బుష్రా, నవ్య, భరత్ బృందాలకు బహుమతులు అందజేశారు. ప్రత్యేక ప్రతిభ కనబరిచిన తులసి నందినికి ప్రత్యేక బహుమతి ఇచ్చారు. పర్యావరణ పరిరక్షణకు హానికర రసాయనాల వినియోగాన్ని తగ్గించి సహజ పదార్థాలను ఉపయోగించాలని ప్రిన్సిపాల్ సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ గౌడ్, విభాగాధిపతి డాక్టర్ రాజు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# టీబీ పరీక్షల శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

- **వైద్యాధికారి డాక్టర్ శివకృష్ణ**



**ఉర్కొండ సెప్టెంబర్ 10 (జనంసాక్షి);** మండలంలోని ఊరుకొండపేట గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ పరీక్షల శిబిరం నేడు శుక్రవారం రోజు నిర్వహించనున్నారని ఈ అవకాశాన్ని గ్రామం తో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ శివకృష్ణ తెలియజేయడం జరిగింది.

ఈ సందర్భంగా డాక్టర్ శివకృష్ణ మాట్లాడుతూ.. గ్రామ ప్రజలంతా టీబీ లక్షణాలు ఉన్నవారు వెంటనే పరీక్షలు చేయించుకోవాలని, రెండు వారాల నుంచి దగ్గు, కఫంలో రక్తం జ్వరం రాత్రిపూట చెమటలు ఆకలి తగ్గడం, బరువు తగ్గడం, చాతి నొప్పి ఆయాసం ఉంటే టీవీ లక్షణాలు ఉన్నవారు తప్పకుండా శిబిరానికి వచ్చి పరీక్ష చేసుకోగలరని తెలియజేశారు.

ముందస్తుగా గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. ప్రజలందరూ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ శివ కృష్ణ సూచించారు.

## కాజ్‌వే నిర్మాణానికి రూ.1.75 కోట్లు నిధులు మంజూరు

- మంత్రి పొన్నం,ఎమ్మెల్యే కవ్వంపల్లికీ ప్రత్యేక కృతజ్ఞతలు
- మాజీ మండల కాంగ్రెస్అధ్యక్షుడు,మాజీ సర్పంచ్ చెప్యాల శ్రీనివాస్ గౌడ్




**బెజ్జంకి,సెప్టెంబర్ 10(జనంసాక్షి):** మండలంలోని గుగ్గిళ్ల-వింజపల్లి గ్రామాల మధ్య లో-లెవెల్ కాజ్ వే నిర్మాణానికి మంత్రి పొన్నం ప్రభాకర్,మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కృషితో ప్రభుత్వం రూ.1.75 కోట్ల నిధులు మంజూరు చేసింది అనీ బెజ్జంకి మాజీ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు,గుగ్గిళ్ళ మాజీ సర్పంచ్ చెప్యాల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ కాజ్‌వే నిర్మాణం కోసం రెండు గ్రామాల ప్రజలు చాలాకాలంగా ఎదురుచూస్తున్నారు అనీ,వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఈ నిర్మాణంతో రైతులు,గీత కార్మికులు, గ్రామ ప్రజలు, వాహనదారుల కష్టాలు తీరనున్నాయి అనీ అన్నారు. రెండు గ్రామాల మధ్య రవాణా సౌకర్యం మెరుగుపడనుంది అనీ అన్నారు. నిధుల మంజూరుపై గుగ్గిళ్ల, వింజపల్లి గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.వారి పక్షాన ప్రభుత్వానికి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కు కలిసి చెప్యాల శ్రీనివాస్ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ద

## తెలంగాణ వీరనారి ఐలమ్మ ఆశయాలను కొనసాగించాలి

**41వ వర్ధంతి సందర్భంగా సిపిఎం ఆధ్వర్యంలో ఘన నివాళులు**



**అమీన్పూర్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):**
తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు భూమికోసం భుక్తి కోసం ఆనాటి నిజాము రాజును ఎదిరించి పోరాడిన వీరనారి చిట్యాల ఐలమ్మ ఆశయాలను కొనసాగించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు నాయిని లలిత అన్నారు. గురువారం ఐలమ్మ 41 వ వర్ధంతి సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో అమీన్పూర్ మండలంలోని బీరంగూడ మండే మార్కెట్ లో ఉన్న ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆస్ఫూర్తితో తెలంగాణ సాయుధ పోరాటంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పాండురంగారెడ్డి, జార్జ్ నర్సింహారెడ్డి, వీరస్వామి, శ్రీనివాస్ రెడ్డి, జిలాని, సునీత సిఐటియు, మహిళా సంఘం నాయకులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదామును తనిఖీ చేసిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా

- ఈవీఎం భద్రతపై ఆరా
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేసిన కలెక్టర్




**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 10(జనంసాక్షి):**
మహబూబ్ నగర్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఉన్న ఈవీఎం గోదామును గురువారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు త్రైమాసిక తనిఖీలో భాగంగా ఈవీఎం, వీవీప్యాట్ గోదామును తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.
అనంతరం గోదాము వద్ద సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఈవీఎం గోదాము వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈవీఎం గదులు, వీవీప్యాట్ గదుల ఏర్పాట్లను పర్యవేక్షించారు.
అనంతరం సీసీటీవీ రికార్డింగ్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ నిర్మల, రాజకీయ పార్టీల ప్రతినిధులు పి.రాజేందర్ రెడ్డి (బీజేపీ), ఎం.సాయి బాబా (కాంగ్రెస్), ఎన్.కురుమూర్తి (సీపీఐ(ఎం)), ఎం.మురళి (టీడీపీ), బీడీ శామ్యూల్ (వైఎస్ఆర్సీపీ), ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గౌతపూర్‌లో గ్రామసభ



**బాలానగర్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం గౌతపూర్‌లో గ్రామ సభ నిర్వహించారు. తాగునీరు, రోడ్ల మరమ్మతులు, వీధి దీపాలు, డ్రైనేజీ, పారిశుధ్యం వంటి సమస్యలపై గ్రామస్తులు చర్చించారు. సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని పంచాయతీ పాలకవర్గం హామీ ఇచ్చింది. గ్రామంలో శాంతిభద్రతలు, భద్రతపై కూడా సమీక్షించారు. రాత్రి వేళల్లో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుపైనా చర్చించారు. సమావేశంలో సర్పంచ్ తాళ్ల ప్రకాష్ గౌడ్, ఉపసర్పంచ్ పెద్దోని యాదయ్య, పంచాయతీ కార్యదర్శి నరేష్, వార్డు సభ్యులు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 800 మొక్కలతో దాచారం పచ్చదనం బాట

- పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక చర్యలు
- సర్పంచ్ బైరా మానస రాజేందర్



**బెజ్జంకి,సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** మండలంలోని దాచారం గ్రామాన్ని పచ్చదనంతో,ఆహ్లాదకర వాతావరణంతో తీర్చిదిద్దే లక్ష్యంతో గురువారం గ్రామ సర్పంచ్ బైరా మానస రాజేందర్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఎస్సీ కాలనీ రహదారి ఇరువైపులా మొదలుకొని స్మశానవాటిక ప్రాంగణం వరకు సుమారు 800 మొక్కలను నాటారు.ఈ సందర్భంగా సర్పంచ్ బైరా మానస రాజేందర్ మాట్లాడుతూ మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు.పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు.నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందిస్తూ సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు.గ్రామంలో పచ్చదనం పెంపొందించేందుకు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని అన్నారు.నాటిన ప్రతి మొక్కను గ్రామ ప్రజలు బాధ్యతగా భావించి సంరక్షించాలని సర్పంచ్ కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దీటి బాలనర్సు,వార్డు సభ్యులు గాదగోని అశోక్,సావనపల్లి రాజు,నేతి మహేష్,కనగండ్ల సోని, చంద్రయ్య,ఓరుగల శంకర్, ఐలయ్య,రాజేశం,భాస్కర్,లింగం,బాలరాజు,మురళి,ఉపాధి హామీ కూలీలు,మేటి రమ,గ్రామ పెద్దలు,ప్రజలు పాల్గొన్నారు.

## దళితులంటే అంటరానివారా?

- పసుపు నీళ్లతో శుద్ధి చేయడం అవమానకరం
- బీఆర్ఎస్ నేతలపై చర్యలు తీసుకోవాలి
- కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ నాయకుల డిమాండ్



జగదేవ్‌పూర్, సెప్టెంబరు 10 (జనంసాక్షి)
 మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఫామ్ హౌస్ వద్ద బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పసుపు నీళ్లతో శుద్ధి చేసి మొత్తం దళిత సమాజాన్ని అవమానించారని గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, జగదేవ్ పూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంపెల్లి కరుణాకర్, మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు జంగని ఐలయ్య, సర్పంచులు ఓం ప్రకాష్, పద్మారావులు ఆరోపించారు. ఈ ఘటనకు పాల్పడిన బీఆర్ఎస్ పార్టీ నాయకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. గురువారం జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు బిఆర్ఎస్ పార్టీ వైఖరి పట్ల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు .కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నేతలు ఇచ్చిన పిలుపుమేరకు కేసిఆర్ ఫామ్ హౌస్ వద్ద దప్పుల మోత నిర్వహించి నిరసన వ్యక్తం చేసేందుకు వెళ్లిన దళిత సంఘాలను అవమానపరిచేలా పసుపు నీళ్లు చల్లడం ఎంతవరకు సమంజసమని విమర్శించారు. సభ్య సమాజం సిగ్గుపడే విధంగా దళితులను అవమానించడం తీరు చూస్తుంటే దొరల గడీల పాలన తలపింప జేస్తుందని దుయ్యబట్టారు.
ప్రజాస్వామ్య వ్యవస్థలో బిఆర్ఎస్ నాయకుల వికృత చేష్టలు దళితులను కించపరిచేలా ఉన్నాయని మండిపడ్డారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవీందర్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇమ్మడి శివలక్ష్మి జహంగీర్ కొండపోచమ్మ మాజీ చైర్మన్ మల్లేశం వార్డు సభ్యుడు వెంకటేష్, నరసింహారెడ్డి గాల్ రెడ్డి పిట్టల నర్సింలు అజీస్ అయుబు దాసు వెంకటేశ్వర్ రెడ్డి శ్రీనివాసరావు వెంకటస్వామి శ్రీను నర్సింలు మురళి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ భద్రత కల్పించాలి



**బిజినేపల్లి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):**
మండల మహిళా సమైక్యలోని అకౌంటెంట్, ఆపరేటర్, అటెండర్ గత 20 సంవత్సరాలు నుంచి విధులు నిర్వహిస్తున్నాము కానీ మాకు చాలీచాలని వేతనాల తోటి మాకు ఉద్యోగ భద్రత & హెచ్ఆర్ పాలసీ హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం ప్రభుత్వం కల్పించాలని మండల సమైక్య, ఆపరేటర్స్, అకౌంటెంట్స్,అటెండర్లుచేపట్టిన నిరసన గురువారం నాటికి నాలుగు రోజు చేరుకున్నదిమండలమహిళ సమైక్యఆపరేటర్ స్వామి,అకౌంటెంట్ రాణి లు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తూ మాట్లాడారు.
 ప్రభుత్వ వ్యవస్థ లో కొన్ని సం. లు గా ప్రభుత్వ పనులు చేస్తూ మహిళా శక్తి కార్యక్రమాలు, ఇందిరమ్మ చీరలు పంచడం, స్కూల్ యూనిఫారం వివరాలు ఆన్లైన్ లో ఎంట్రీ, ఉల్లాస్ డాటా ఎంట్రీ చేసి విద్యార్థులకు డ్రెస్ లు పంపిణి చేసే విధముగా సహాయపడుతున్నాం కానీ ప్రభుత్వ పనులలో పాల్గొంటు ఉద్యోగ బద్రత లేక సమాన పనికి సమాన వేతనం లేక విధులు నిర్వహిస్తూ ఉన్నాం కావున మాకు 2013 లో ఇచ్చిన సర్కులర్ ప్రకారం మాకు సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ చేసి ఆపివేయడం జరిగింది సర్కులర్ ప్రకారం మాకుసి బి ఓ హెచ్ ఆర్ కల్పించాలని ప్రభుత్వం ని డిమాండ్ చేశారు.

## తంగళ్లపల్లిలో జాతీయ కుటుంబ ఆదాయ సర్వే



**కోహెడ, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** మండలంలోని తంగళ్ళపల్లి గ్రామం లో గురువారం జాతీయ కుటుంబ ఆదాయ సర్వే క్షేత్రస్థాయి పనులను ఎన్ఎస్ఓ జాతీయ సీనియర్ గణాంక కార్యాలయం , కరీంనగర్ ఉప ప్రాంతీయ కార్యాలయ సీనియర్ గణాంక అధికారి గోవర్ధన శ్రీనివాసరావు తంగళ్లపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న జాతీయ కుటుంబ ఆదాయ సర్వే క్షేత్రస్థాయి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జూనియర్ గణాంక అధికారి బి. నవీన్ కుమార్ నిర్వహిస్తున్న సర్వే పనులను ఆయన తనిఖీ చేసి, స్థానిక ప్రజలు, కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సర్వే ప్రాముఖ్యతను వారికి వివరించి, కుటుంబాల నుంచి ఖచ్చితమైన, సంపూర్ణ సమాచారాన్ని అందించి ఎన్ఎస్ఓ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.
భారత ప్రభుత్వ గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సర్వే ద్వారా దేశవ్యాప్తంగా కుటుంబాల ఆదాయం, ఆదాయ వనరులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ సమాచారం విశ్వసనీయ గణాంక విశ్లేషణకు, ఆధారపూర్వక ప్రణాళికల రూపకల్పనకు అలాగే ప్రభుత్వ విధాన నిర్ణయాలకు ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.
సర్వే గణాంకాల నాణ్యతను నిర్ధారించేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది నిర్దేశిత సర్వే విధానాలు, మార్గదర్శకాలు, నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బోయిని సంపత్ పాల్గొని సర్వే పనులకు తగిన సహకారాన్ని అందించారు.

# అభివృద్ధి పనులపై క్షేత్రస్థాయి పర్యవేక్షణ పెంచాలి

- కొండాపూర్‌లో పాఠశాల, ఫామ్‌పాండ్ పనుల పరిశీలన



కొండాపూర్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి): మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడంతో పాటు నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా పరిషత్ సీఈఓ జానకి రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె అధికారులతో కలిసి మండలంలోని పలు అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గిర్మాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలను తనిఖీ చేసి విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడారు. విద్యాబోధన, వసతి, భోజన సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. వంటగది, భోజనశాలలను పరిశీలించి ఆహార నాణ్యతను స్వయంగా తనిఖీ చేశారు. తొగర్పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఫామ్‌పాండ్ పనులను పరిశీలించి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం కొండాపూర్ ఎంపీపీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఏపీఓ, ఏపీఎం, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులతో సమీక్ష నిర్వహించారు. గ్రామపంచాయతీ అభివృద్ధి పనులు, వీఓఏ భవనాలు, జలసిరి, ఫామ్‌పాండ్ల నిర్మాణం తదితర అంశాలపై సమీక్షించారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను మరింత పెంచాలని సీఈఓ సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సౌమ్యశ్రీ, డీపీఆర్ గీత, ఏపీఓ పూజ, వీరప్ప, తొగర్పల్లి సర్పంచ్ దివ్యవాణి ప్రశాంత్‌గౌడ్, ఉపసర్పంచ్ అక్కామొల్ల వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్‌నగర్ నూతన డీఎఫ్ఓగా నవీన్ రెడ్డి



మహబూబ్‌నగర్, బ్యూరో, సెప్టెంబర్ 10 (జనంసాక్షి): మహబూబ్‌నగర్ జిల్లా నూతన జిల్లా అటవీ అధికారిగా మందాడి నవీన్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం గురువారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో అటవీ సంరక్షణ, పచ్చదనం పెంపు, వన్యప్రాణుల పరిరక్షణ తదితర అంశాలపై చర్చించారు. మందాడి నవీన్ రెడ్డి యూపీఎస్సీ ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ 2019 బ్యాచ్‌లో ఆల్ ఇండియా ప్రథమ ర్యాంక్ సాధించారు. గతంలో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో విధులు నిర్వహించిన సమయంలో వేసవిలో వన్యప్రాణులకు తాగునీటి కొరత లేకుండా సోలార్ బోర్లు ఏర్పాటు చేసి, వాటి ద్వారా సాసర్ పిట్స్ నిర్మించడంలో ప్రత్యేక చొరవ చూపారు. అనంతరం వనపర్తి, జోగులాంబ గద్వాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో జిల్లా అటవీ అధికారిగా విధులు నిర్వహిస్తూ అటవీ, వన్యప్రాణుల సంరక్షణకు విశేష సేవలు అందించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం అటవీ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన నవీన్ రెడ్డి జిల్లాలో అటవీ సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలు, ప్రాధాన్యతలను వివరించారు. అటవీ భూముల ఆక్రమణలు, అక్రమ చెట్ల నరికివేతపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఫీల్డ్ స్థాయిలో పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పచ్చదనాన్ని పెంచేందుకు విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాలకు నూతన వేగం తీసుకువస్తామని పేర్కొన్నారు. అటవీ సంపదను కాపాడటంతో పాటు వన్యప్రాణులకు అనుకూల వాతావరణం కల్పించేందుకు సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు.

## చిన్న వడ్డేమాన్- ఉంద్యాల బ్రిడ్జికి రూ.3 కోట్లు



దేవరకద్ర, సెప్టెంబర్ 10 (జనంసాక్షి): దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి చొరవతో చిన్న వడ్డేమాన్ నుంచి ఉంద్యాలకు వెళ్లే మార్గంలో బ్రిడ్జి నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరయ్యాయి. వర్షాకాలంలో వాగు పొంగడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు చాలాకాలంగా బ్రిడ్జి కోసం ఎదురుచూస్తున్నారు. గ్రామ సర్పంచ్ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి నిధులు మంజూరు చేయించారు. నిధులు మంజూరైన విషయం తెలియడంతో సర్పంచ్, గ్రామస్తులు, కాంగ్రెస్ కార్యకర్తలు హర్షం వ్యక్తంచేస్తూ బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## దళితుల ఇళ్లకు వచ్చారని శుద్ధి చేయడం సిగ్గుచేటు

- మాజీ ముఖ్యమంత్రి హోదాకు, ప్రతిపక్ష నాయకుడి స్థాయికి ఇది తగదు
- కేసీఆర్ వెంటనే దళితులకు క్షమాపణ చెప్పాలి
- నారాయణపేట్ జిల్లా తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్



నారాయణపేట, సెప్టెంబర్ 10 (జనంసాక్షి): దళితులు తన నివాసానికి వచ్చారనే కారణంతో పసుపు నీటితో ఇల్లు శుభ్రం చేయించారనే ఘటన బాధాకరమని తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు గవినోళ్ల శ్రీనివాస్ అన్నారు. ఇలాంటి చర్యలు దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తాయని విమర్శించారు. సమానత్వం, సామాజిక న్యాయం గురించి మాట్లాడే నేతలు వివక్షకు తావులేని విధంగా వ్యవహరించాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడి స్థాయికి ఇలాంటి చర్యలు తగవని పేర్కొన్నారు. దళితులు సమాన హక్కులు, గౌరవం కలిగిన పౌరులని తెలిపారు. ఘటనపై కేసీఆర్ వెంటనే దళిత సమాజానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని గవినోళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా పోరెడ్డి రాజేందర్



కల్వకుర్తి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి): సంజాపూర్ పాఠశాల ఎస్‌జీటీ ఉపాధ్యాయుడు పోరెడ్డి రాజేందర్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. 16 ఏళ్లుగా ఉపాధ్యాయుడి గా సేవలందిస్తున్న ఆయన విద్యార్థుల అభివృద్ధికి విశేష కృషిచేశారు. తుమ్మలపల్లి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ విద్యార్థుల సంఖ్యను 14నుంచి62కు పెంచారు. దాతలు, గ్రామపంచాయతీ సహకారంతో పాఠశాలకు తాగునీరు, మరుగుదొడ్లు, స్మార్ట్ టీవీ తదితర సదుపాయాలు కల్పించారు. విద్యార్థులకు యోగా, ఆంగ్లం, పోటీ పరీక్షలు, వివిధ పోటీలు నిర్వహించారు. ప్రస్తుతం జిల్లా అకాడమిక్ ప్యానెల్ తనిఖీ సభ్యుడిగా ఉపాధ్యాయులకు సూచనలు అందిస్తూ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నారు.

## బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రాస్తారోకో

- రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



మక్తల్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి): రైతులకు నిరంతరం ఎదురవుతున్న సాగు సమస్యలపై భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా తీవ్ర నిరసన తెలిపింది. మక్తల్ మండలం జక్లేర్ సబ్ స్టేషన్ ఎదుట, నేషనల్ హైవే 167పై బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతులు, పార్టీ నాయకులు పెద్దఎత్తున రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ఎటువంటి అంతరాయం లేకుండా 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి. వర్షాభావ పరిస్థితుల కారణంగా నష్టపోయిన నారాయణపేట జిల్లాను వెంటనే అధికారికంగా కరువు జిల్లాగా ప్రకటించాలి. ఎండిపోయిన, దెబ్బతిన్న పంటలకు ఎకరాకు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలి. రైతులు తీసుకున్న అన్ని రకాల పంట రుణాలను బేషరతుగా పూర్తిగా మాఫీ చేయాలని అన్నారు. రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో కొద్దిసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు గోవర్ధన్ గౌడ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. బలరాం రెడ్డి, ఉపాధ్యక్షులు కర్ని స్వామి, యువ మోర్చా నాయకులు భరత్ కుమార్, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి దుబ్బల హనుమంత, వివిధ మండలాల కిసాన్ మోర్చా అధ్యక్షులు, రైతులు పాల్గొన్నారు.

## మహిళా సంఘం 13వ వార్షిక సర్వసభ్య సమావేశం



కొల్చారం, సెప్టెంబర్ 10 (జనంసాక్షి): కొల్చారం మండలంలోని అప్పాజీపల్లి గ్రామంలో మహిళా పరస్పర సహకార పొదుపు మరియు పరపతి సంఘం ఫెడరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో 13వ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అభివృద్ధి, మహిళల ఆర్థిక స్వావలంబనకు సంబంధించిన అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నాయిని వెంకట్ గౌడ్ (గజిని)ను కదూరి సుశీలను,గ్రూప్ లీడర్లను చలం నగరాణి, చింతల రేణుక సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోషిని, వార్డు సభ్యులు, బాధ్యులు సుశీల, మానేపల్లి సావిత్రి, సదాల నర్సింలు, వీఓఏ కన్యబోయిన అశోక్తో పాటు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## సిర్సవాడ మాజీ ఎంపీటీసీ రమేష్ రెడ్డిని, పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి



తాడూర్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి): తాడూర్ మండలంలోని సిర్సావాడ గ్రామ మాజీ ఎంపీటీసీ రమేష్ రెడ్డి గారి తండ్రి మాజీ PACS డైరెక్టర్ ప్రతాప్ రెడ్డి,మరణించడంతో ఈరోజు వారి ఇంటికి వెళ్లి ఆయన పార్థివ దేహానికి నివాళులు అర్పించడం జరిగినది. రమేష్ రెడ్డిని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ శాసన సభ్యులు శ్రీ మర్రి జనార్దన్ రెడ్డి.

## అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం





మక్తల్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి): బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధించినా భయపడేది లేదని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి. నరసింహాగౌడ్ అన్నారు. గురువారం ఆయనను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. తనతో పాటు మాజీ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షుడు చిన్న హనుమంతు, గుర్లపల్లి సర్పంచ్ గాలి రెడ్డి శివారెడ్డి, ఉప్పరిగుంటి రఘును అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. తెలంగాణ సాధన కోసం పోరాడిన బీఆర్ఎస్ నాయకులకు అరెస్టులు కొత్తేమీ కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలపై అసెంబ్లీలో ప్రశ్నిస్తారనే భయంతోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేశారని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే అరెస్టులకు పాల్పడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల సస్పెన్షన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అసెంబ్లీ వేదికగా, క్షేత్రస్థాయిలో ప్రజా ఉద్యమాలు చేపట్టి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని హెచ్చరించారు.

# బివిఆర్ఐటి నుంచి జాతీయ హ్యాకథాన్‌కు 50 జట్లు

**నర్సాపూర్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** బి.వి.రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (BVRIT)లో నిర్వహించిన రెండు రోజుల స్మార్ట్ ఇండియా ఇంటర్నల్ హ్యాకథాన్-2026 పోటీలు గురువారం ఘనంగా ముగిశాయి. సెప్టెంబరు 9, 10 తేదీల్లో కళాశాలలోని జూబీ బ్లాక్ సెమినార్ హాల్‌లో ఈ పోటీలు నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మీ ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దూబే, మేనేజర్ బాపిరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ హ్యాకథాన్‌లో 360 జట్లు పాల్గొన్నాయి. వీటిలో 74 హార్డ్‌వేర్, 286 సాఫ్ట్‌వేర్ జట్లు ఉన్నాయి. సివిల్, ఈసీఈ, సీఎస్ఈ, ఈఈఈ, మెకానికల్, ఐటీ, ఏఐఎంఎల్ తదితర విభాగాలకు చెందిన 2,160 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో 729 మంది విద్యార్థినులు ఉన్నారు. స్మార్ట్ ఆటోమేషన్, గ్రీన్ టెక్నాలజీ, రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ, హెల్త్‌కేర్, వ్యవసాయం తదితర రంగాల్లోని సామాజిక సమస్యలకు విద్యార్థులు వినూత్న సాంకేతిక పరిష్కారాలను రూపొందించి



ప్రదర్శించారు. జ్యూరీ సభ్యులు సమగ్రంగా మూల్యాంకనం చేసి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 50 జట్లను జాతీయ స్థాయి స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2026 పోటీలకు ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దూబే తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ ఓసీ కోఆర్డినేటర్ డాక్టర్ యు.గణేష్ నాయుడు, టి.పి.ఒ డాక్టర్ జె. బంగారాజు, విద్యార్థి కోఆర్డినేటర్లు డి.లిఖిల్, ఎం.అచాసా గిడియాన్, కె.హిరణ్మయి, సిహెచ్. ఆశ్రిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డివైడర్ను ఢీకొన్న ద్విచక్ర వాహనం వ్యక్తికి గాయాలు..

**గండీడ్, సెప్టెంబర్, 10(జనంసాక్షి):** రంగారెడ్డిపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలు,వివరాల్లోకి వెళ్తే..కోస్గి మండలం, గొల్లపల్లి గ్రామానికి చెందిన తిరుపతయ్య(52),తండ్రి చంద్రయ్య తన సొంత గ్రామమైన బొల్లంపల్లికి పని నిమిత్తం వెళ్లి తిరిగి మహబూబ్ నగర్,వస్తుండగా ఈప్రమాదం జరిగింది.రంగారెడ్డి పల్లి దగ్గర అదుపుతప్పిన ద్విచక్ర వాహనం డివైడర్ను ఢీ కొట్టింది.ఈఘటనలో వాహనంపై నుండి పడిపోవడంతో అతని తలకు,ఎడమ కాలికి తీవ్ర గాయాలయి కాలు, విరిగింది. బాధితుడు జానంపేట మండలంలోని ఓ పాఠశాలలో రికార్డు అసిస్టెంట్ గా పనిచేస్తున్నాడు.ప్రస్తుతం మహబూబ్నగర్ లో నివాసం ఉంటున్నాడు.ప్రమాదాన్ని గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ కు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే 108 సిబ్బంది, ఈఎంటి స్వాతి, పైలట్ అక్బర్ హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. క్షేత్ర





గాత్రుడికి అంబులెన్స్ లోనే ప్రాథమిక చికిత్స అందించి, మహబూబ్నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు, అంతలోనే కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని, అతని దగ్గర ఉన్న వస్తువులను కుటుంబ సభ్యులకు 108 సిబ్బంది అందజేశారు.

# కుట్టు శిక్షణ... కుంటుబడ్డ భరోసా ఆరు నెలలైనా అందని సర్టిఫికెట్?

- **నేర్చుకున్నారు... నిరాశే మిగిలింది.... కంబాలాపురంలో మహిళల ఆవేదన**
- **సర్టిఫికెట్ల కోసం ఆరు నెలల నిరీక్షణ... గ్రామీణ స్వరాజ్ సంస్థ తీరుపై విమర్శలు**

**శ్రీరంగాపూర్ మండల్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** కుట్టు మిషన్ శిక్షణ పూర్తయి ఆరు నెలలు గడుస్తున్న ఇప్పటివరకు సర్టిఫికెట్లు అందకపోవడంతో శిక్షణ పొందిన మహిళలు నిరాశకు గురవుతున్నారు. కంబాలపురం గ్రామంలో గ్రామీణ స్వరాజ్ స్వచ్ఛంద సంస్థ విజయలక్ష్మి పర్యవేక్షణలో జనవరి 16న ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నెల రోజులపాటు నిర్వహించిన శిక్షణను ఫిబ్రవరి 26వ తారీఖున పూర్తి చేశారు శిక్షణ పూర్తయిన అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తామని ఆ సర్టిఫికెట్ల ద్వారా భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు పొందే అవకాశం ఉందని శిక్షణ ఇన్చార్జి విజయలక్ష్మి పేర్కొన్నట్లు శిక్షణ పొందిన మహిళలు తెలిపారు.

శిక్షణ పొంది నెలలు గడుస్తున్న ఇంతవరకు సర్టిఫికెట్లు అందకపోవడంతో శిక్షణ పొందిన మహిళలు ఆందోళన



వ్యక్తం చేస్తున్నారు.శిక్షణ ద్వారా ఉపాధి అవకాశాలు పొందవచ్చని ఆశించిన మహిళలకు సర్టిఫికెట్లు అందకపోవడంతో వారి ఆశలు నిరాశగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సర్టిఫికెట్లను వెంటనే అందజేసేలా చర్యలు తీసుకోవాలని శిక్షణ పొందిన మహిళలు కోరుతున్నారు.

# రమేష్ రెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు: ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

- **ఓ నమ్మకమైన కాంగ్రెస్ నాయకుడిని కోల్పోయాం... రమేష్ రెడ్డి మృతి తీరని విషాదం**
- **పాడె మోసిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, దుష్యంత్ రెడ్డి**



**రాజాపూర్, సెప్టెంబర్ 10(జనంసాక్షి):** చేన్నవెల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు రమేష్ రెడ్డి బుధవారం రాత్రి గుండె పోటుతో మృతి చెందారు. మృతి పట్ల జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గురువారం వారి స్వగ్రామంలో రమేష్ రెడ్డి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, ఆయన సోదరుడు దుష్యంత్ రెడ్డి పాడె మోసి అంతిమయాత్రలో పాల్గొని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రమేష్ రెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు.

# ఫామ్ పాండ్‌లతో రైతులకు బహుళ ప్రయోజనాలు

- **నీటి నిల్వతో పాటు కూరగాయలు, తీగజాతి పంటలు**
- **చేపల పెంపకానికి వినియోగించుకోవచ్చు**
- **ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి**
- **జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**

**కోడేరు/నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** ఫామ్ పాండ్‌ల ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకోవడంతో పాటు కూరగాయలు, తీగజాతి పంటలు సాగు చేసుకోవచ్చని, చేపల పెంపకంతో అదనపు ఆదాయం పొందవచ్చని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు. గురువారం కోడేరు మండలం బావాయిపల్లి గ్రామంలో ఆకస్మికంగా పర్యటించిన ఆయన వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. వి.బి.జి. రామ్‌జీ పథకంలో భాగంగా రైతు మహేశ్వరి పొలంలో నిర్మిస్తున్న ఫామ్ పాండ్ పనులను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మహేశ్వరి భర్త బంగారయ్య పొలంలో 12×12 మీటర్ల విస్తీర్ణంలో రూ.1.13 లక్షల అంచనా వ్యయంతో ఫామ్ పాండ్ నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పనులను 15 రోజుల్లో పూర్తి చేయాలని, నాణ్యతలో రాజీ పడవద్దని కలెక్టర్ ఆదేశించారు. ఫామ్ పాండ్‌లను సమర్థవంతంగా వినియోగించుకొని వ్యవసాయంలో అదనపు ఆదాయ మార్గాలను అభివృద్ధి చేసుకోవాలని రైతులకు సూచించారు.





అనంతరం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లక్ష్మీకళ భర్త చంద్రయ్య నిర్మిస్తున్న ఇంటిని కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. గ్రామంలో 14 ఇళ్లు మంజూరు కాగా రెండు రద్దయ్యాయని, మరో రెండు ఎల్-3 దశలో ఉన్నాయని, మిగిలిన 10 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని అధికారులు తెలిపారు. రెండో విడతలో గుడిసెల్లో నివసిస్తున్న అర్హులకు మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ ఎం.డి. జమీల్, సర్పంచ్ పరశురాములు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు వదిలేసి హరిత హోటల్ ప్రతిపాదనలా?

- **బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బాలా త్రిపుర సుందరి**

**జడ్చర్ల, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** నియోజకవర్గంలో రోడ్లు, తాగునీరు, సాగునీరు, విద్యుత్ వంటి కనీస వసతులు లేక ప్రజలు అల్లాడుతుంటే, ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి హరిత టూరిజం హోటల్ ప్రతిపాదనలు చేయడం సరికాదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బాలా త్రిపుర సుందరి విమర్శించారు. గురువారం ఆమె పత్రికా ప్రకటన ద్వారా తెలుపుతూ ప్రభుత్వ స్థలాన్ని హోటల్‌కు కేటాయించే ముందు పెండింగ్ అభివృద్ధి పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గంగాపూర్-బాలానగర్, నవాబుపేట-



కుత్నేపల్లి, రాజాపూర్-రంగారెడ్డిగూడ రోడ్డు పనులు ఏళ్లకు ఏళ్లుగా ఆగిపోయాయని, గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయని పేర్కొన్నారు. సూరారంలో తాగునీటి ఎద్దడి, విద్యుత్ సమస్యలు తీర్చాలని, ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితులను ఆదుకోవాలని కోరారు. ఉపాధి లేక యువత వలసపోతున్నారని, పరిశ్రములు నెలకొల్పడం పక్కనపెట్టి శంకుస్థాపనలకే పరిమితం కావడం తగదన్నారు. ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రజా సమస్యలపై మాట్లాడి నిధులు సాధించి పనులు పూర్తి చేయాలని హితవు పలికారు.

# నోటీసులు తీసుకున్న ఓటర్లు ధ్రువపత్రాలు అందజేయాలి

**ఉర్కొండ, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహించిన కుటుంబ సమగ్ర సర్వేలో నోటీసులు అందుకున్న ఓటర్లు సరైన ధ్రువ పత్రాలు సమర్పించాలని సర్ ప్రోగ్రాం జడ్చర్ల కోఆర్డినేటర్ బొజ్జ అమరేందర్ రెడ్డి సూచించారు. పత్రాలు అందజేయని పక్షంలో ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉందన్నారు. ఉర్కొండ మండలంలో ఎస్ఐఆర్ ఫేజ్-2 కార్యక్రమంలో పాల్గొని బీఎల్‌వోలు ఓటర్లకు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాన్ని పరిశీలించారు. సమస్యల పరిష్కారానికి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో



మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అయూబ్ పాషా, జీపీఓ సాజిద్, బీఎల్వోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, బీఎల్ఏలు తదితరులు పాల్గొన్నారు.

# పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలి: పివైఎల్

**నారాయణపేట, సెప్టెంబర్ 10(జనంసాక్షి):** పెరిగిన నిత్యావసర ధరలు తగ్గించాలని ప్రగతి శీల మహిళా సంఘం ఆధ్వర్యంలో నారాయణ పేట జిల్లా అడిషనల్ కలెక్టర్ కు గురువారం వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జయలక్ష్మి. జిల్లా కార్యదర్శి సౌజన్య మాట్లాడుతూదేశంలో, రాష్ట్రంలో గత నాలుగు నెలలుగా నిత్యవసర ధరలు ఆకాశాన్నిఅంటుతున్నాయన్నారు. దీనితో సామాన్య ప్రజలు నిరుపేదలు బతుకులు దారుణంగా తయారవుతు న్నాయనీ ఆందోళన వ్యక్తం చేశారు. పూట గడవని స్థితి తలెత్తుతున్నాయన్నారు. నిత్యవసర సరుకులైన చక్కెర, వంటనూనె, బియ్యం, పప్పు, ఉల్లిపాయలు, టమాటాలు ఒక్కటే మిటి నిత్యవసర వస్తువుల ధరలు



విపరీతంగా పెరుగుతున్నాయి అన్నారు.

నిత్య వసర సరుకుల ధరలు నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా కార్యదర్శి సౌజన్య, పిఓడబ్ల్యు జిల్లా కమిటీ సభ్యులు సునీత, మంజుల, చంద్ర కళ, అరుణ, గజలమ్మ, లలిత, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 10 (జనంసాక్షి); ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలని, ప్రణాళికాబద్ధంగా చదివి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం కేటీ దొడ్డి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి చదువు, అభ్యసన సామర్థ్యాలను తెలుసుకున్నారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, పాత ప్రశ్న పత్రాలను పునఃశ్చరణ చేయించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఖాన్ అకాడమీ ఆన్లైన్ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఇప్పటి నుంచే ప్రణాళికతో బోధన చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. గతేడాది ఫలితాలపై ఆరా తీసి ఈసారి కూడా వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే కాక అత్యధిక విద్యార్థులు 500కు పైగా మార్కులు పొందాలని ఆకాంక్షించారు. త్వరలో జరగబోయే ఎస్ఏ1 పరీక్షల్లోనూ విద్యార్థులు ప్రతిభ చాటాలని సూచించారు. విద్యార్థుల దినచర్యను తెలుసుకొని వారికి విద్యాలయంలో కల్పించిన మౌలిక వసతులపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు పోషకాహారంతో కూడిన భోజనం అందించాలని ఆదేశించారు. వంట, స్టోర్ గదులను పరిశీలించి పరిశుభ్రతను పాటించాలని సూచించారు. కేజీబీవీకి సంబంధించిన హాజరు, ఇతర రిజిస్టర్లను పరిశీలించిన కలెక్టర్ తగు సూచనలు చేశారు. ఈ పర్యటనలో తహసిల్దార్ కరుణాకర్, ఎంపీడీవో రమణారెడ్డి, కేజీబీవీ ప్రత్యేక అధికారి పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

## మట్టి గణపతే మహా గణపతి

- వాసవి మా ఇల్లు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలు ఉచిత పంపిణీ
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆవిష్కరించారు



సంగారెడ్డి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి): పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా వాసవి మా ఇల్లు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గత 18 ఏళ్లుగా నిర్వహిస్తున్న మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది 5,016 మట్టి వినాయక ప్రతిమలను సిద్ధం చేశారు. సంగారెడ్డి పట్టణ ప్రజలకు ఉచితంగా పంపిణీ చేయనున్న మట్టి వినాయక ప్రతిమలను గురువారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం వాసవి మా ఇల్లు సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ప్రజలు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు తోపాజి అనంత కిషన్ ఆధ్వర్యంలో గత 18 సంవత్సరాలుగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఏడాది సుమారు 5 వేల మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి పుల్లూరి ప్రకాష్, జిల్లా జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు బండారు యాదగిరి, సంస్థ ఉపాధ్యక్షులు మ్యాడమ్ రాధాకిషన్, ఆమేటి మహేందర్, కార్యదర్శి కొంపల్లి విద్యాసాగర్, సభ్యులు నామా భాస్కర్, జూలకంటి మల్లేశం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### నోటీసులు అందుకున్న

## ఓటర్లు భయపడొద్దు: తహసిల్దార్ దశరథ్



జహీరాబాద్, సెప్టెంబర్ 10(జనంసాక్షి): ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జహీరాబాద్ తహసీల్దార్ దశరథ్ కోరారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. నోటీసులు అందుకున్న వారు తమకు సూచించిన విధంగా తగిన ఆధారాలను సమర్పించాలని సూచించారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేసేందుకు అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, నిర్ణీత గడువులో పూర్తిచేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు అధికారులకు సహకరించాలని దశరథ్ కోరారు.

## సంకల్పమే స్ఫూర్తిగా.. బెక్కెం గ్రామ వాసికి డాక్టరేట్





వనపర్తి/చిన్నంబావి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి): చిన్నంబావి మండలం బెక్కెం గ్రామానికి చెందిన పోతులపల్లి కమలాకర్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ సాధించారు. సెప్టెంబర్ 8న జరిగిన 85వ స్నాతకోత్సవంలో గవర్నర్, వర్సిటీ ఛాన్సలర్ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా పట్టా అందుకున్నారు. సౌర విద్యుత్‌ను సమర్థంగా వినియోగించడం, సూర్యకాంతి మార్పుల మధ్య సోలార్ ప్యానళ్ల విద్యుత్ ఉత్పత్తిని పెంచడం, గ్రిడ్ అనుసంధానం వంటి అంశాలపై పరిశోధన చేశారు. ఈ పరిశోధన సౌర విద్యుత్, ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ రంగాలకు ఉపయోగపడనుంది. గ్రామీణ విద్యార్థులకు కమలాకర్ ప్రస్థానం స్ఫూర్తిదాయకమని గ్రామస్థులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

### 22ఏ భూముల

## అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలి

- బీజేపీ మండల అధ్యక్షుడు కొలిపాక రాజు



బెజ్జంకి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి): మండలంలోని 22ఏ నిషేధిత భూముల జాబితాలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని బీజేపీ మండల అధ్యక్షుడు కొలిపాక రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కోర్టు వివాదాలు లేని ప్రైవేటు పట్టా భూములను సైతం 22ఏలో చేర్చడంతో రైతులు భూములు విక్రయించలేక, కొనుగోలు చేయలేక, రుణాలు పొందలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామం, సర్వే నంబర్ వారీగా జాబితాను బహిర్గతం చేసి, గత చేర్పులు, తొలగింపులపై ఆడిట్ నిర్వహించాలని కోరారు. డిజిటల్ లాగ్‌లపై ఫోరెన్సిక్ ఆడిట్ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మద్యం మత్తులో కిందపడి వ్యక్తి మృతి



తెలకపల్లి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి): మండలంలోని లక్నారం గ్రామానికి చెందిన మన్నేం ఎల్లస్వామి (30) మద్యం మత్తులో ఇంట్లో కిందపడి మృతి చెందాడు. ఎస్సై ఎం. రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లస్వామి, తాండ్ర కృష్ణవేణి (35)తో సహజీవనం చేస్తూ హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకునేవారు. కొంతకాలంగా మద్యానికి బానిసైన ఎల్లస్వామి పనులకు వెళ్లడం మానేశాడు. పది రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. బుధవారం సాయంత్రం మద్యం సేవించి రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి వచ్చి మత్తులో బోర్లా పడిపోయాడు. అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

### ఎన్ఎస్‌యూఐ తెలంగాణ

## జాయింట్ సెక్రెటరీగా జుబేర్ అహ్మద్



ఆత్మకూర్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి): ఎన్ఎస్‌యూఐ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా ఆత్మకూర్‌కు చెందిన జుబేర్ అహ్మద్ నియమితులయ్యారు. విద్యార్థి ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఆయనకు పార్టీ అధిష్ఠానం ఈ బాధ్యతలు అప్పగించింది. విద్యార్థి, యువజన సమస్యల పరిష్కారం తో పాటు నాణ్యమైన విద్య, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాల కోసం కృషి చేస్తానని జుబేర్ తెలిపారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచిన నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జుబేర్‌కు రాష్ట్ర బాధ్యతలు దక్కడంపై మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి, ఎన్ఎస్‌యూఐ జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు అభినందనలు తెలిపారు.

### ఐలమ్మ స్ఫూర్తితో

## ప్రజా సమస్యలపై పోరాడాలి

- సీపీఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్



వనపర్తి రూరల్, సెప్టెంబర్ 10, (జనంసాక్షి): వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని సీపీఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్ పిలుపునిచ్చారు. గురువారం వనపర్తి సీపీఐ కార్యాలయంలో ఐలమ్మ వర్ధంతిని నిర్వహించి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కళావతమ్మ, జిల్లా కమిటీ సభ్యులు రవీందర్, చిన్న కురుమన్న, శేఖర్, జయమ్మ, జ్యోతి, వెంకటమ్మ, చందు తదితరులు పాల్గొన్నారు.

### చాకలి ఐలమ్మ

## ఆశయాలను కొనసాగించాలి

ఇటిక్యాల, సెప్టెంబర్ 10 (జనంసాక్షి): చాకలి ఐలమ్మ ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగించాలని గ్రామ సర్పంచ్ మహేష్ గ్రామస్తులకు సూచించారు. గురువారం మండలంలోని ఉదండాపురం గ్రామంలో ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ యుగంధర్, గ్రామ రజక సంఘం అధ్యక్షుడు మద్దిలేటి, గ్రామస్తులు పాల్గొన్నారు.

### సాయుధ పోరాటాన్ని

## రగిలించిన అగ్నికణం ఐలమ్మ

- రైతు, కూలీలను ఏకం చేసి ఉద్యమానికి ఊపిరిలుదిన గొప్ప యోధురాలు
- సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు
- ఐలమ్మ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించిన సీపీఎం



సంగారెడ్డి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి): సాయుధ పోరాటాన్ని రగిలించిన అగ్నికణం ఐలమ్మ అని, రైతు, కూలీలను ఏకం చేసి ఉద్యమానికి ఊపిరిలుదినా గొప్ప యోధురాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అన్నారు. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా సీపీఎం సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ వద్ద ఉన్న ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించ రు ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నర్సింలు, జిల్లా కమిటీ సభ్యులు యాదగిరి, రేవంత్, కృష్ణ, నాయకులు అశోక్, రమేష్ గౌడ్, విఠల్, శివ కుమార్, మహేష్, తది తరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల ఉక్కుపాదం

• మూడు టిప్పర్లు స్వాధీనం



**మక్తల్, సెప్టెంబర్ 10 (జనం సాక్షి):** మక్తల్ మండల పరిధిలో అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు పోలీసులు చేపడుతున్న ప్రత్యేక తనిఖీల్లో భాగంగా, నేడు మహబూబ్ నగర్ రోడ్డులోని దండు సమీపంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 3 టిప్పర్లను టాస్క్ ఫోర్స్ మరియు మక్తల్ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్నట్లు గుర్తించిన ఈ మూడు వాహనాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా మక్తల్ ఎస్సై రాజు మాట్లాడుతూ అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమంగా తరలించడం, నిల్వ చేయడం లేదా విక్రయించడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. అక్రమ రవాణా పై నిరంతరం నిఘా కొనసాగుతుందని, పట్టుబడిన వారిపై సమగ్ర దర్యాప్తు జరుపుతున్నామని ఆయన వెల్లడించారు.

## ఖిల్లాలో ఘనంగా చిట్యాల చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలు

• ముఖ్య అతిధులుగా పాల్గొన్న రజక సంఘం జిల్లా నాయకులు విజయ్



**ఖిల్లా ఘనపురం,10, సెప్టెంబర్, (జనంసాక్షి):** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చిట్యాల చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలను గురువారం ఖిల్లా ఘనపూర్ మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ ఆవరణలో రజక సంఘం జిల్లా నాయకులు విజయ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ క్యామ నవనీత, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు అగారం ప్రకాష్, వడ్డెర సంఘం జిల్లా నాయకులు భూమయ్య, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రాళ్ల కృష్ణయ్య, దిశ కమిటీ జిల్లా సభ్యులు మూడావత్ రవి నాయక్, మాజీ సర్పంచ్ కృష్ణయ్య గౌడ్,పాలవాది రాజు, బుచ్చిబాబు గౌడ్, రజక సంఘం నాయకులు బాలస్వామి, పాలకొండ నారాయణ, పాకిరయ్య, ఆంజనేయులు, వెంకటేష్, ప్రసాద్, శివ, పెద్దాపురం శ్రీనివాసులు, గణేష్, గ్రామ పెద్దలు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తిదాయకం

• మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్



**పెబ్బేరు సెప్టెంబర్ 10 (జనంసాక్షి):**
తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ ప్రజాస్వామ్యంలో స్ఫూర్తిదాయకమని మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ ఘనంగా నివాళులర్పించారు. గురువారం పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఎదుట ఉన్న చాకలి ఐలమ్మ 41 వర్ధంతి సందర్భంగా విగ్రహానికి ఆయన పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... తెలంగాణ మట్టి ఆత్మగౌరవాన్ని, పేదల భూమి హక్కులను కాపాడేందుకు భూస్వాములపై ఎదురొడ్డి నిలిచిన వీరమాత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కొంతం దయాకర్ రెడ్డి సీనియర్ కాంగ్రెస్ నాయకులు ,జగదీశ్వర్ రెడ్డి, షకీల్,యుగేందర్ రెడ్డి,రజక నరసింహ,పెద్ద రాములు, సునీల్ రెడ్డి,రజక సంఘం సభ్యులు సూరయ్య, జయన్న, రాముడు, యం.దస్తగిరి, బాలయ్య,ఇ. సురేష్, పారిజాత, చంద్ర శేఖర్ పాల్గొని వీరనారి చాకలి ఐలమ్మ సేవలను స్మరించుకున్నారు.

## కోహీర్ రైల్వే గేట్ వద్ద ఫ్లైఓవర్ నిర్మించాలి

• గంటల తరబడి నిలిచిపోతున్న వాహనాలు
• ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్న అత్యవసర వాహనాలు
• శాశ్వత పరిష్కారం కోసం ప్రజల డిమాండ్



**కోహీర్, సెప్టెంబర్ 10(జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహీర్ రైల్వే గేట్ వద్ద వాహనదారులు, ప్రయాణికులకు ట్రాఫిక్ కష్టాలు నిత్యకృత్యంగా మారాయి. రైలు రాకముందే గేట్ మూసివేయడంతో ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోతున్నాయి. రైలు వెళ్లే వరకు గేట్ తెరుచుకోకపోవడంతో వాహనదారులు గంటల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంటోంది.
గేట్ మూసివేయడంతో ద్విచక్ర వాహనాలు, కార్లు, లారీలు, ఇతర వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరుతున్నాయి. అత్యవసర పనులపై వెళ్లేవారితో పాటు ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా అంబులెన్సులు, ఇతర అత్యవసర వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకునే పరిస్థితి ఏర్పడుతుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
రైల్వే గేట్ వద్ద తరచూ ఇదే పరిస్థితి పునరావృతమవుతోందని స్థానికులు వాపోతున్నారు. గేట్ ఎక్కువసేపు మూసివేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని పేర్కొంటున్నారు. రైల్వే గేట్ వద్ద ఫ్లైఓవర్ లేదా అండర్‌పాస్ నిర్మిస్తేనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

**ఫ్లైఓవర్‌తోనే శాశ్వత పరిష్కారం...**

కోహీర్ రైల్వే గేట్ వద్ద పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని ఫ్లైఓవర్ నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఫ్లైఓవర్ నిర్మిస్తే రైళ్ల రాకపోకల సమయంలో గేట్ మూసివేసినా వాహనాల రాకపోకలకు అంతరాయం ఉండదని చెబుతున్నారు. దీంతో ప్రయాణికుల సమయం ఆదాకావడంతో పాటు అత్యవసర వాహనాలకు కూడా సులభంగా మార్గం లభిస్తుందని పేర్కొంటున్నారు.
ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రజాప్రతినిధులు, రైల్వే ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఫ్లైఓవర్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. అప్పటివరకు గేట్ మూసివేసే సమయాల్లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు స్థానిక పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. రైల్వే శాఖ కూడా రైళ్ల రాకపోకల సమయాల్లో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన బీఆర్ఎస్ యువ నేతల అరెస్టు



**సంగారెడ్డి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్‌ను నిరసిస్తూ నిర్వహించనున్న అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరిన బీఆర్ఎస్ యువ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేల గొంతు నొక్కడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించడం ప్రతిపక్షాల హక్కని పేర్కొన్నారు. నిరసనకు సిద్ధమైన తమను అరెస్టు చేయడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమన్నారు. ప్రజల సమస్యలను మరుగునపెట్టలేరని, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యువ నాయకులు శ్రవణ్ రెడ్డి, 9వ వార్డు ఇన్‌చార్జ్ లాడే బాలు, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

## వీరనారి చిట్యాల ఐలమ్మ పోరాట స్ఫూర్తి అమరం

• జడ్చర్లలో ఘనంగా 41వ వర్ధంతి



**జడ్చర్ల, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరవనిత చిట్యాల ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలు జడ్చర్ల పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల సాధనకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్య, రాజు, శేఖర్, శివ కుమార్, ప్రసాద్, నర్సిములు, లక్ష్మయ్య, బాలరాజ్, రమేష్, మల్లేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, జడ్చర్ల సిగ్నల్ గడ్డ అంబేద్కర్ చౌరస్తాలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు.
ఈ సందర్భంగా నాయకులు యాదయ్య, సాయిలు, నరసింహ మాట్లాడుతూ భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం జరిగిన పోరాటంలో ఐలమ్మ ముందు నిలిచారని, ఆమె ఆశయ సాధనకు కృషి చేయడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కర్ణ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు





**రామచంద్రాపురం, సెప్టెంబర్ 10 (జనం సాక్షి):** రామచంద్రపురం పరిధిలోని కాకతీయనగర్ కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ అధికారులను ఆదేశించారు.
కాలనీ అధ్యక్షుడు అమృతసాగర్, కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు జలమండలి అధికారులతో మాట్లా డిన ఆయన.. సిబ్బందితో కలిసి సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలించారు. శాశ్వత పరిష్కారానికి నూతన పైప్‌లైన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.
అదేవిధంగా కాకతీయనగర్-శంకర్‌నగర్ బ్రిడ్జి వద్ద చెత్తను డంపింగ్ చేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా, సంబంధిత పారిశుధ్య సూపర్‌వైజర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

## తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండా గద్దె నిర్మాణానికి వినతిపత్రం



**ఘనపూర్ మండలం, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** హవేలీ ఘనపూర్ మండల కేంద్రంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండా గద్దె నిర్మాణం చేపట్టాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బట్టి అజయ్, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు కేవల్ నందకిషోర్ పంచాయతీ కార్యదర్శిని కలిసి పార్టీ జెండా గద్దె నిర్మాణానికి అనుమతులు కల్పించాలని కోరారు. నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో పార్టీ కార్యకలాపాలను మరింత బలోపేతం చేసే దిశగా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వారు తెలిపారు. పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం పనిచేస్తామని పేర్కొన్నారు.

## పోషణ మాసం సందర్భంగా పోషకాహార వారోత్సవాలు



**కోహెడ, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** శ్రీరాములపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలు-1, 2లో పోషణ మాసం సందర్భంగా పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథి సర్పంచ్ పోలు శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు పోషకాహారం అవసరమన్నారు. గర్భిణీలు, బాలింతలు సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. రిలయన్స్ ఫౌండేషన్ బ్లాక్ కోఆర్డినేటర్ భాస్కర్ ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పప్పులు, చిరుధాన్యాలు ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ కవిత, టీచర్లు, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, గర్భిణీలు, చిన్నారులు పాల్గొన్నారు.

## మైనార్టీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎండీ మోసిన్



**కొండాపూర్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** కొండాపూర్ మండల మైనార్టీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా మల్కాపూర్ గ్రామానికి చెందిన ఎండీ మోసిన్ నియమితులయ్యారు. బుధవారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి సమక్షంలో ఆయన నియామకం జరిగింది.

తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు మోసిన్ కృతజ్ఞతలు తెలిపారు. అప్పగించిన బాధ్యతలను సమర్థ వంతంగా నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన జగ్గారెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు, పార్టీ శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు మోసిన్‌ను అభినందించారు.

## ఆర్టిఐ సాధన సమితి ఉపాధ్యక్షుడిగా సునీల్ కుమార్



**న్యాల్‌కల్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** సమాచార హక్కు చట్టం (ఆర్టిఐ) సాధన సమితి జహీరాబాద్ నియోజకవర్గపు ఉపాధ్యక్షుడిగా సునీల్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం హైదరాబాద్ లోని సాధన సమితి ప్రధాన కార్యాలయంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. న్యాల్ కల్ మండలం, ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన ఎం.సునీల్ కుమార్ ను నియోజకవర్గపు ఉపాధ్యక్షుడిగా ఎంపిక చేశారు. సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చంటి, రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ సర్దార్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు స్రవంతి, తదితరుల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. నియోజకవర్గంలోని ప్రజా హక్కుల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన ఉపాధ్యక్షుడు పేర్కొన్నారు. కార్యక్రమంలో సాధన సమితి శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన మండలస్థాయి క్రీడలు



**శివ్వంపేట, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** స్కూల్ గేమ్స్ అఫ్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడలు శివ్వంపేట మండల పరిధిలోని గోమారం పాఠశాల గ్రౌండ్ గురువారం మండల విద్యాశాఖ అధికారి బుచ్చానాయక్ ప్రారంభించారు. ఈ క్రీడోత్సవాలలో భాగంగా మొదటగా వాలీబాల్, ఖోఖో ఆటలు ఆడిపించారు. శుక్రవారం కబడ్డీ, ఖోఖో గేమ్స్ ఉంటాయని పిడి చంద్రమోహన్ తెలిపారు. వాలీబాల్ లో పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శివ్వంపేట ప్రథమ స్థానం సాధించగా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రత్నపూర్ ద్వితీయ స్థానంలో రాణించింది. అయితే ఈ ఆటల బహుమతులకు క్రీడాకారులకు అందజేయడానికి ప్లేమింగ్ యాజమాన్యం ముందుకు రావడం అభినందనీయమని ఎంఈవో బుచ్చానాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాధవరెడ్డి ప్లేమింగ్ యాజమాన్యం రాజేందర్, రత్నాకర్ లతో పాటు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, అలాగే పీడీలు, పీఈటీలు ఇతర ఉపాధ్యాయులు, క్రీడాకారులు విద్యార్థులు పాల్గొన్నారు.

## చేనేత సొసైటీలో అవినీతి అవాస్తవం

- **జిల్లా అధ్యక్షుడు జన్ను ఆంజనేయులు**



**నారాయణపేట సెప్టెంబర్ 10(జనంసాక్షి):** నారాయణపేట జిల్లాలోని చేనేత సహకార సంఘాల్లో కోట్లాది రూపాయల అవినీతి జరిగిందనీ కొందరు ధర్నాలకు పూనుకుని అసత్య ప్రచారం చేస్తున్నారని ఎలాంటి అవినీతి జరగలేదని జిల్లా చేనేత సంఘం అధ్యక్షుడు జన్ను ఆంజనేయులు స్పష్టం చేశారు.గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చేనేత సొసైటీలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు రావడం లేదని అలాంటప్పుడు అవినీతి ఎలా జరుగుతుందనీ ప్రశ్నించారు.ప్రభుత్వం నేరుగా జియో ట్యాగ్ ఉన్న కార్మికుల ఖాతాలకు నిధులు జమ చేస్తున్నదని తెలిపారు.కానీ కొందరు ప్రభుత్వాన్ని మోసం చేసి కేసులో ఇరుక్కున్న ఒక వ్యక్తి కోసం ధర్నాలకు పూనుకోవడం హాస్యాస్ప దంగాఉందన్నారు.బుధవారం జరిగిన ధర్నాలో ఒక్క చేనేత కార్మికుడు లేకపో యినా కొన్ని పార్టీలు మద్ద తు పలకడం విచిత్రంగా ఉందని అన్నారు.ధర్నాలకు పురమాయించి లబ్దిపొందాలని చూసే వ్యక్తి వ్యక్తిత్వాన్ని గుర్తించి పార్టీలు మద్దతు తెలపాలని కోరారు.

## బిజ్వారంలో చాకలి ఐలమ్మ వర్ధంతి



**మల్దకల్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** మల్దకల్ మండలం బిజ్వారం గ్రామంలో గ్రామ రజక కమిటీ సంఘం ఆధ్వర్యంలో గురువారం చాకలి ఐలమ్మ వర్ధంతిని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వై.రాజారెడ్డి, వై.భరత్ కుమార్ రెడ్డి,బాలగౌడ్, తిమ్మప్ప, చంద్రశేఖర్,టి.నర్సింహులు గ్రామ రజక కమిటీ సంఘం అధ్యక్షుడు సి.నర్సింహులు,ఉపాధ్యక్షుడు పరమేష్,ప్రధాన కార్యదర్శి సి.సిద్దు,గ్రామ రజక సంఘం కమిటీ నాయకులు చిన్న నరసింహులు,లక్మన్న, నర్సింహులు, వెంకట్రాములు,కృష్ణ, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల సంరక్షణ, భద్రతకు ప్రత్యేక శ్రద్ధ

- **జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య**



**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** జాతీయ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య గురువారం సంగారెడ్డిలోని శిశు గృహం, బాల న్యాయ మండలి, సఖి కేంద్రాలను సందర్శించారు.

శిశు గృహంలో పిల్లల సంరక్షణ, ఆరోగ్యం, విద్య, భద్రత, వసతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పిల్లల బాగోగులను నిరంతరం పర్యవేక్షించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సఖి కేంద్రంలో బాధితుల సమస్యలను సానుభూతితో విని, వారికి అవసరమైన న్యాయ సహాయం అందించాలని తెలిపారు. కుటుంబ సమస్యలను కౌన్సిలింగ్ ద్వారా సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు.

బాల న్యాయ మండలిలో బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించారు. తెలిసీ తెలియక చేసిన తప్పుల వల్ల భవిష్యత్తు దెబ్బతినకుండా జాగ్రత్తగా ఉండాలని, మంచి ప్రవర్తనతో ముందుకు సాగాలని సూచించారు. ఉచిత న్యాయ సహాయం అవసరమైన వారు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయాన్ని సంప్రదించడంతో పాటు 15100 ఉచిత న్యాయ సహాయ నంబర్‌కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి, బాల న్యాయ మండలి సభ్యురాలు కే.ధనలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డులతో సంక్షేమ పథకాలు సులభతరం

- **సీఎం ప్రవాసి ప్రజావాణి రాష్ట్ర సమన్వయకర్త బొజ్జ అమరేందర్ రెడ్డి**



**ఉప్పునుంతల, సెప్టెంబర్ 10 (జనం సాక్షి):** స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ సరుకులతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత సులభంగా అందుతాయని సీఎం ప్రవాసి ప్రజావాణి రాష్ట్ర సమన్వయకర్త బొజ్జ అమరేందర్‌రెడ్డి అన్నారు. ఉప్పరిపల్లి గ్రామంలో గురువారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పాత రేషన్ పుస్తకాలతో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించడంతో పాటు నకిలీ కార్డులను అరికట్టేందుకు ప్రభుత్వం స్మార్ట్ కార్డులు అందిస్తోందన్నారు. క్యూఆర్ కోడ్, హోలోగ్రామ్ వంటి భద్రతా లక్షణాలతో కార్డులను రూపొందించినట్లు తెలిపారు. ప్రభుత్వ సేవలను పారదర్శకంగా, సులభంగా అందించేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బొజ్జ గీతా అమరేందర్‌రెడ్డి, పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## కొండాపూర్ మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నర్సింలు



**కొండాపూర్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):** కొండాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గౌడి చర్ల నర్సింలు నియమితులయ్యారు. తనకు బాధ్యతలు అప్పగించిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డితో పాటు మండల పార్టీ ముఖ్య నాయకులకు నర్సింలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. నాయకులు, కార్యకర్తల సహకారంతో మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేస్తానని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ నిరంతరం పనిచేస్తానని నర్సింలు పేర్కొన్నారు.

## చాకలి ఐలమ్మకు ఘన నివాళి



**నారాయణపేట, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** నారాయణపేటజిల్లా కేంద్రంలో గురువారం వీర వనిత చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి రజక సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. స్థానిక చౌక్ బజార్ నందు చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి కార్యక్రమం చాలా ఘనంగా నిర్వహించారు. చాకలి ఐలమ్మ గారి పోరాట పటిమ గురించి ఈ సందర్భంగా వివరించారు. సురేష్, వెంకటప్పా, సత్యమ్మ గోపాల్ ,కృష్ణ, శేషు, కడెం పల్లి రఘు, సాయిలు, లలితమ్మ, నరేష్, బాలరాజ్ ,శరణప్ప, బాల్రాజ్,అశోక్ తదితరులు రజకులు పాల్గొన్నారు.

## దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే సహించం



**బెజ్జంకి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** మండల కేంద్రంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కత్తి రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కొంకటి రాములు మాట్లాడారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను సహించబోమన్నారు. ఫామ్‌హౌస్ ముట్టడికి వెళ్లిన దళితులు తాకిన నేలను పసుపు నీటితో శుభ్రం చేశారన్న ఘటనపై బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్‌లో ఉన్న దళిత నాయకులు ఆత్మగౌరవం ఉంటే పార్టీకి రాజీనామా చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకే బీఆర్‌ఎస్ విమర్శలు చేస్తోందని ఆరోపించారు.సమావేశంలో రోడ్డ ఐలయ్య, మచ్చ కుమార్, మాతంగి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ పోస్టుల రోస్టర్‌లో దళితులకు అన్యాయం



**ఉప్పునుంతల, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీలో రోస్టర్ విధానం ద్వారా దళితులకు అన్యాయం జరిగిందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నాగరాజు, కేవీపీఎస్ మండల నాయకుడు లక్ష్మణ్ ఆరోపించారు. కంసానిపల్లిలోని రెండు పోస్టులను బీసీలకే కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ నాగర్‌కర్నూల్ కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ఎస్సీల జనాభా గణనీయంగా ఉన్నందున కనీసం ఒక పోస్టును ఎస్సీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ నిబంధనలను పునఃపరిశీలించి ఎస్సీ, ఎస్టీలకు న్యాయం చేయాలని, పోస్టుల కేటాయింపులో సామాజిక న్యాయం పాటించాలని కోరారు.

# ఎస్ఐఆర్‌పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష




**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బి.చెన్నయ్యతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికల సంఘం గడువు పొడిగించిన నేపథ్యంలో అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా పార్టీలు ప్రత్యేకంగా కృషి చేయాలని కోరారు.
సవరించిన షెడ్యూల్ ప్రకారం క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణకు అక్టోబర్ 7 వరకు అవకాశం ఉందని, తుది ఓటర్ల జాబితా నవంబర్ 9న ప్రచురించనున్నట్లు తెలిపారు. అనర్హులు, మరణించిన వారు, శాశ్వతంగా వలస వెళ్లినవారు, డూప్లికేట్ నమోదులను నిబంధనల ప్రకారం పరిశీలించాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 1,15,824 నోటీసులు జారీ చేయగా, 329 మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. హియరింగ్‌కు హాజరుకావాల్సిన 47,236 మందిలో సుమారు 40 శాతం మందికి విచారణ పూర్తయిందన్నారు. హాజరుకాని సుమారు 25 వేల మందికి మరో అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. సెప్టెంబర్ 20లోగా అన్ని హియరింగ్‌లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.
రాజకీయ పార్టీలు తమ పరిధిలోని ఓటర్ల జాబితాలను పరిశీలించి అభ్యంతరాలు, సూచనలను నిర్ణీత గడువులోగా ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. బీఎల్ఓలు ప్రజలకు క్లెయిమ్స్, అభ్యంతరాలు, హియరింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, బీఆర్ఎస్, టీడీపీ, వైఎస్సార్ కాంగ్రెస్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ డ్రైవ్‌లతో యువతకు ఉద్యోగావకాశాలు...

- నిరుద్యోగులకు అండగా సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి
- 35 మంది యువతకు తుక్కుగూడలో ఇంటర్వ్యూలు



**కల్వకుర్తి,సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా జాబ్ డ్రైవ్‌లను నిరంతరం కొనసాగిస్తున్నట్లు టాస్క్ సీఓఓ,ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం తుక్కుగూడలోని ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీలో నిర్వహించిన ఉద్యోగ ఇంటర్వ్యూలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కల్వకుర్తి నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి 35 మంది నిరుద్యోగ యువత ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వెల్దండ నుంచి 11 మంది, కల్వకుర్తి నుంచి ఏడుగురు, ఆమనగల్లు నుంచి 16 మంది, తలకొండపల్లి నుంచి ఒకరు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ యువతకు అందుబాటులోకి వచ్చే ప్రతి ఉద్యోగ,ఉపాధి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హత, నైపుణ్యాలకు అనుగుణంగా లభించే అవకాశాలను అందిపుచ్చుకుని భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలన్నారు.యువతకు ఉపాధి కల్పించడం ద్వారా వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు.జాబ్ డ్రైవ్‌లను నిరంతరం నిర్వహించి మరింత మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు వీర, మహేష్, ఐక్యత ఫౌండేషన్ సభ్యుడు చంద్రశేఖర్, ఇంటర్వ్యూలకు హాజరైన నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

# పోలీస్ ఉద్యోగార్థులకు పరవస్తు ఫౌండేషన్ అండ



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** తెలంగాణ పోలీస్ శాఖలో ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, రాంకీ ఫౌండేషన్, లైన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ గ్రీన్‌ల్యాండ్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ నిర్వహించనున్నట్లు పరవస్తు ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ గద్దె భాస్కర్, రాంకీ ఫౌండేషన్ అధ్యక్షుడు మువ్వ రామిరెడ్డి తెలిపారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు పి.మధుకర్ స్వామి సారథ్యంలో ఈ కార్యక్రమం కొనసాగనుంది.
శిక్షణకు అర్హులైన అభ్యర్థులు సెప్టెంబర్ 9 నుంచి 17వ తేదీ రాత్రి 9 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఫౌండేషన్ సోషల్ మీడియా వేదికల్లో అందుబాటులో ఉన్న క్యూఆర్ కోడ్ లేదా లింక్ ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. అభ్యర్థుల ఎంపికకు సెప్టెంబర్ 20న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రాష్ట్రవ్యాప్తంగా 13 పరీక్షా కేంద్రాల్లో అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్, వనపర్తిలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.
అర్హత పరీక్షలో మెరిట్ ఆధారంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన 100 మంది అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. ఎంపికైన వారికి ఉచిత భోజనం, వసతితో పాటు దుస్తులు అందించి రెసిడెన్షియల్ శిక్షణ ఇస్తామన్నారు. పరీక్ష ఫలితాలను సెప్టెంబర్ 22న ప్రకటించనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు సెప్టెంబర్ 25న శంషాబాద్‌లోని పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ క్యాంపస్‌లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే పోలీస్ నియామక ప్రక్రియలో మెయిన్ పరీక్ష వరకు శిక్షణ కొనసాగుతుందని తెలిపారు.

# వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీర వనిత ఐలమ్మ


- మాజీ మండల రైతు సమితి అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి



**బిజినేపల్లి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):**
వెట్టి చాకిరి విముక్తి కోసంపోరాడిన తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ అనిమాజీ మండల రైతు సమితి అధ్యక్షులు నెల్లికంటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ 41 వ వర్ధంతి పురస్కరించుకొని ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.జీవితాంతం ప్రజల హక్కుల కోసం పోరాడిన ఐలమ్మ 1985 సెప్టెంబర్ 10న వీరమరణం పొందారన్నారు. తెలంగాణ చరిత్రలో ఆమె పేరు నేటికీ ధైర్యం, ఆత్మగౌరవం, పోరాటానికి ప్రతీకగా గుర్తించబడ్డదని అన్నారు.ఈ కార్యక్రమంలోతుమ్మల అలోజీ,శ్రీనివాసులు, సాగర్,రాజేందర్ గౌడ్, బాలమసయ్య, రాజు, గఫూర్, రిజ్వాన్,బెక్కరిశివ, సాయి,గోవిందు,మల్లేష్,రాము తదితరులు పాల్గొన్నారు.

## కొండాపూర్ మండల

# ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా సంద గళ్ల సునీల్



**కొండాపూర్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):**
కాంగ్రెస్ పార్టీ కొండాపూర్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా తొగర్‌పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు సంద గళ్ల సునీల్ నియమితులయ్యారు. బుధవారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆయనకు పార్టీ బాధ్యతలు అప్పగించారు.
గతంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేసిన సునీల్, చిన్ననాటి నుంచే పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ గ్రామ, మండల స్థాయిల్లో వివిధ బాధ్యతలు నిర్వహించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ అధిష్ఠానం ఆదేశాలను పాటిస్తూ ముందుకు సాగుతున్నారు. తనపై నమ్మకంతో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన జగ్గారెడ్డితో పాటు మండల, నియోజకవర్గస్థాయి నాయకులకు సునీల్ కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఎస్సీ సెల్ బలోపేతానికి, పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.

## కొండాపూర్ మండల

# కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షుడిగా హాజీ హోలీ పటేల్



**కొండాపూర్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** మండల పరిధిలోని సైదాపూర్ గ్రామానికి చెందిన హాజీ హోలీ పటేల్‌ను కొండాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షుడిగా నియమించారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సమక్షంలో ఆయనకు పార్టీ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా హాజీ హోలీ పటేల్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకులకు, జగ్గారెడ్డి, నిర్మల జగ్గారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూనే మైనార్టీల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని పేర్కొన్నారు.


# కోడలిపై గొడ్డలితో మామ దాడి... కర్నూలు ఆసుపత్రికి తరలింపు..

- కేసు నమోదు: ఎస్సై శేఖర్ గౌడ్

**గట్టు,సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** సొంత కోడలిపై గొడ్డలితో మామ దాడి చేసిన సంఘటన గట్టు పోలీస్ స్టేషన్ పరిధిలోనే చాగదోన గ్రామములో చోటుచేసుకున్నది. ఈ సంఘటనకు సంబంధించి గట్టు ఎస్సై శేఖర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. చాగదోన గ్రామానికి చెందిన జాన్ కు కర్ణాటకలోని ఎరిగెర కి చెందిన రీటా తో గత ఐదు సంవత్సరాల క్రితం వివాహమైంది. అయితే వీరికి సంతానం కలగకపోవడంతో, మామ కొయ్యి తిమ్మప్ప కోడల్ని పిల్లలు కావడం లేదంటూ దూషిస్తూ ఉన్నాడు. ఈ క్రమంలో చంపుతానంటూ బెదిరించడంతో రెండు సంవత్సరాల క్రితం మామ పోరు తట్టుకోలేక కోడలు సొంత గ్రామమైన ఎరిగెరకు వెళ్లిపోయింది. అనంతరం పెద్దమనుషుల పంచాయితీ అనంతరం మళ్లీ సంసారం చేయడానికి చాగదోనకు వచ్చింది. ఇటీవల మామ కోడల్ని కొడుకుని ఇటుకల పనికి పంపించడానికి అంటూ అడ్వాన్సుగా రూ లక్ష రూపాయలు తీసుకున్నాడు. అడ్వాన్స్‌గా తీసుకున్న డబ్బులతో మామ మద్యం సేవిస్తూ జల్సాలు చేస్తుండడంతో బుధవారం కోడలు మామను ప్రశ్నించింది. మా పేర్లపై డబ్బులు తీసుకొని ఎందుకు మద్యం సేవించి జల్సాలు చేస్తున్నావంటూ అడగడంతో నన్నే ప్రశ్నిస్తావా అంటూ ఆగ్రహించిన మామ కుయ్యి తిమ్మప్ప కోడలు రీటాపై ఇతి ట్లోనే గొడ్డలితో దాడి చేయగా తలకు బలమైన గాయమైంది. దీంతో అక్కడే ఉన్న చిన్న కుమారుడు యాకూబ్ అక్కడికి వచ్చి గొడవను వారించి భర్తకు సమాచారం ఇవ్వడంతో వెంటనే వారు వచ్చి గాయపడిన బాధితురాలిని ఐజ ఆసుపత్రి తరలించారు అక్కడి నుంచి కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితురాలు రీటా వాంగ్మూలంతో మేరకు కేసు నమోదు చేసుకొని మామ కొయ్యి తిమ్మప్ప పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో

## ఉద్యమిస్తాం : సిపిఎం పార్టీ మండల అధ్యక్షుడు బాల్ రెడ్డి




**వీపనగండ్ల, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):**
వీపనగండ్ల మండలం కేంద్రంలోని కామ్రేడ్ నరసింహ భవనంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోపాల్ దిన్నె సర్పంచ్ దొడ్ల కవిత,గ్రామ శాఖ కార్యదర్శులు జక్కుల ఆశన్న, నక్కఈశ్వర్, నాయకులు మధుగని రామకృష్ణ, జెట్టి నవీన్,శరత్, మిద్దె శ్రీను పాల్గొన్నారు.

# వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

**కొల్చారం, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ సూచించారు. కొల్చారం మండల కేంద్రంలోని బాబా ఫంక్షన్ హాల్‌లో ఎస్సై మహమ్మద్ మోహినుద్దీన్ ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. డీఎస్పీ ప్రసన్నకుమార్, రూరల్ సీఐ కృష్ణమూర్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ప్రతి గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఉత్సవాలు నిర్వహించాలని ఎస్సై సూచించారు. అనుమతిలేని కార్యక్రమాలు చేపట్ట వద్దని, పోలీసులకు సహకరించాలని కోరారు. ప్రతి మండపం వద్ద రాత్రివేళల్లో ఐదుగురు కమిటీ సభ్యులు తప్పనిసరిగా ఉండాలని సీఐ కృష్ణమూర్తి తెలిపారు. కోతుల బెడద ఉన్నందున మండపాల వద్ద నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వినాయక మండపాల్లో డీజేలకు ఎలాంటి అనుమతి లేదని డీఎస్పీ స్పష్టం చేశారు. అధిక శబ్దంతో వృద్ధులు, గుండె సంబంధిత సమస్యలున్న వారు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. సాధారణ సౌండ్‌బాక్స్‌లను మాత్రమే వినియోగించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాత్రివేళల్లో పోలీసులు ప్రత్యేక బృందాలతో మండపాలను తనిఖీ చేస్తారని తెలిపారు.





సమావేశానికి హాజరైన సర్పంచులు, ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు, యువజన సంఘాల ప్రతినిధులకు పోలీస్ శాఖ తరఫున ధన్యవాదాలు తెలిపారు. అనంతరం డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐ కృష్ణమూర్తిని సర్పంచుల ఫోరం అధ్యక్షుడు యాబన్న గారి రవితేజ రెడ్డి, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గురుజాల్ ప్రజల కల నెరవేరుతుంది

- గుర్జాల్ బీటీ రోడ్డు పనులు ప్రారంభం

**కృష్ణ, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** కృష్ణ మండలంలోని గుర్జాల్ గ్రామ ప్రజల చిరకాల స్వప్నమైన బిటి రోడ్డు సౌకర్యం మంత్రి వాకిటి శ్రీహరి కృషితో నెరవేరుతుంది. ఎన్నికల హామీలో భాగంగా వాకిటి శ్రీహరి ఇచ్చిన హామీ మేరకు సాకారం అవుతోంది. మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవతో గుర్జాల్ గ్రామం నుంచి కృష్ణ రైల్వే బ్రిడ్జి వరకు మొత్తం రూ.2.45 కోట్ల వ్యయంతో చేపట్టిన రహదారి అభివృద్ధి పనుల్లో భాగంగా ఇప్పటికే 1 కిలోమీటర్ సీసీ రోడ్డు పనులు పూర్తయ్యాయి. తాజాగా మరో 1 కిలో మీటర్ బీటీ రోడ్డు పనుల ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజ్జప్ప గౌడ మాలిపాటేల్ , గుర్జాల్ సర్పంచ్ కమలమ్మ, సంతోష్ పాటిల్ , ఉప సర్పంచ్ షఫీ,యువజన కాంగ్రెస్ అధ్యక్షులు , షేక్ సర్ఫరాజ్ , జిల్లా కార్యవర్గ సభ్యులు అన్వర్, సోమ సంతోష్ శెట్టి, కృష్ణ సర్పంచ్ నాగేంద్ర, రాకేష్, పల్లె సురేష్, జవహర్లాల్, ఆసిఫ్ , సిద్రామ్ , కీరప్ప గౌడ, చన్ను, మాజీ ఎంపీటీసీ నాగప్ప, తీమన్న, తిమప్ప, శంకర గౌడ , తదితరులు, శ్రేయోభిలాషులు, గ్రామ పెద్దలు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజా కార్యక్రమం నిర్వహించారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్న మంత్రి వాకిటి శ్రీహరికి, గుర్జాల్ గ్రామ ప్రజలు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తరపున, కృతజ్ఞతలు తెలిపారు.



## రాంరెడ్డిపేట్ పాఠశాలలో విద్యా ప్రమాణాల పరిశీలన

**నిజాంపేట్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** నిజాంపేట్ మండలంలోని రాంరెడ్డిపేట్ గ్రామంలోని ఎం.పి.యు.పి.ఎస్. పాఠశాలను బాచేపల్లి సిహెచ్ఎం వెంకట్ రాథోడ్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా రెండో తరగతి విద్యార్థుల చదివే సామర్థ్యాన్ని పరీక్షించారు. నాలుగో తరగతి తరగతి గదిని పరిశీలించి విద్యార్థుల అభ్యాస పుస్తకాలను తనిఖీ చేశారు.



అనంతరం పాఠశాల వంటశాలను పరిశీలించి మధ్యాహ్న భోజనంలో పరిశుభ్రత, నాణ్యత పాటించాలని వంట సిబ్బందికి సూచించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశమై ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా సామర్థ్యాల పెంపునకు చేపట్టాల్సిన చర్యలపై సూచనలు చేశారు. విద్యార్థుల్లో ప్రాథమిక విద్యా సామర్థ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు ప్రత్యేకంగా కృషి చేయాలని కోరారు.

### రూ:10లక్షల డీఎంఎఫ్టీ

## నిధులతో ఎద్దడి నివారణకు చర్యలు

**న్యాల్‌కల్, సెప్టెంబర్ 10, (జనంసాక్షి):** కలెక్టర్ ప్రత్యేక చొరవతో మండలంలోని అమీరాబాద్, టేకూర్ గ్రామాల్లో త్రాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టినట్లు మండల మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారి అనిల్ కుమార్ తెలిపారు. 2026 ఆర్థిక సంవత్సరానికి గాను డిస్టిక్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ (డీఎంఎఫ్టి) నిధులు రూ:10 లక్షలతో ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ మేరకు అమీరాబాద్ గ్రామానికి రూ:5, టేకూర్ గ్రామానికి రూ:5 లక్షల మేర నిధులు మంజూరు అయ్యాయి. గురువారం మండలంలోని అమీరాబాద్ గ్రామంలో గ్రామ సర్పంచ్ విజయ పలువురు స్థానికులతో కలిసి పైప్ లైన్ పనులను ప్రారంభించారు.



ఆయా గ్రామాల్లో దాదాపు 860 మీటర్ల మేరకు పైప్ లైన్ నిర్మాణ పనులను పూర్తిచేసి త్రాగునీటిని సరఫరా చేయనున్నారు. ఎట్టకేలకు ఎద్దడి నివారణకు కలెక్టర్, మిషన్ భగీరథ అధికారులు దృష్టి సాధించడం పట్ల ఆయా గ్రామాలకు చెందిన అధికార, విపక్ష శ్రేణులు వైద్యనాథ్, శోభ, విజయ్, తదితరులు సంతోషం వ్యక్తం చేశారు.

### బాల్కంచెల్క తండాలో

## ఘనంగా మహా చండీ హోమం



**నిజాంపేట్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** నిజాంపేట్ మండలంలోని బాల్కంచెల్క తండా గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ విశ్వపాలిని జ్వాలాముఖి శ్రీ సేవాలాల్ మహారాజ్ మహా మందిరంలో గురువారం మహా చండీ హోమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి పాలాభిషేకం, హారతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త మండలి సభ్యురాలు మూడ్ లలితా కిషన్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. పాడిపంటలు సమృద్ధిగా పండి రైతులకు లాభాలు చేకూరాలని, విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

## వీరనారి చాకలి ఐలమ్మకు ఘన నివాళి



**తెలకపల్లి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** మండల కేంద్రంలో వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలను మల్లికార్జున రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ము చంద్రశేఖర్, రజక సంఘం గౌరవ అధ్యక్షుడు బక్కయ్య, అధ్యక్షుడు శ్రీను, ప్రచార కార్యదర్శి పవన్‌కుమార్, లింగస్వామి, సత్యనారాయణ, అబ్బాస్, మెట్రో శివ, నడిపయ్య, మధు, పసుపల విజయ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజి చైర్మన్ హనుమంతరావు, సింగిల్ విండో వైస్ చైర్మన్ యాదయ్య, మాజీ ఎంపీటీసీ రమేష్, ఎత్తపు రవి, బొపెల్లి నిరంజన్, అనిల్‌కుమార్, వార్డు నంబర్ సొంటె మల్లేష్, వార్డు నంబర్ శిరీష, కొమ్ము ఆనంద్, శివ తదితరులు పాల్గొన్నారు.

### భూమి కోసం భుక్తి కోసం

## పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ

**అమరచింత, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, పీడిత ప్రజల ఆత్మగౌరవ ప్రతీక చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు సుతారి శ్రీనివాసులు మాట్లాడుతూ భూమి, పంట రక్షణ కోసం దొరల దోపిడీకి, నిజాం నిరంకుశ పాలనకు ఐలమ్మ ఎదురొడ్డి పోరాడారని తెలిపారు. ఆమె తెగువ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తిగా నిలిచిందన్నారు. మహిళా శక్తికి, ఆత్మగౌరవానికి ఐలమ్మ ప్రతీకగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో సవరన్న, ఎస్. వెంకటేష్, కోరి శ్రీనివాసులు, తాయికుమార్, సుతారి దేవమ్మ, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



# చిదానంద చేతితో అపురూప చిత్రాలే

- మట్టి వినాయకులతో పర్యావరణహితం
- శిక్షణ లేకున్నా తండ్రి ప్రేరణతో కలారుడైన వైనం


**కృష్ణ, సెప్టెంబర్ 10, (జనంసాక్షి):** కృష్ణ మండలం గుడెబల్లూర్ గ్రామానికి చెందిన అవుసలి చిదానంద్ (విశ్వకర్మ) చేతితో అపురూప చిత్రాలు గీయడం కాకుండా పర్యావరణహితం కోసం మట్టి వినాయకులను తయారు చేస్తూ ప్రచారం సాగిస్తున్నారు. 30 సంవత్సరాల నుండి ఒక కళాకారునిగా జీవితాన్ని గడుపుతున్నారు. నేమ్ బోర్డు రాయడం, వాల్ డిజైన్ వర్క్ చేయడం, థర్మకోల్ కటింగ్ వర్క్ చేయడం బొమ్మలు గీయడం, మట్టి తో గణేష్ విగ్రహాలు చేయడం చిన్నప్పటి నుండి నేర్చుకున్నారు. తండ్రి ఒక కళాకారుడు ఆయన చేస్తుంటే చూస్తూ అలా నేర్చుకున్నది తప్ప..! ఎక్కడ ఏ స్కూల్లో నేర్చుకున్నది కాదు. చిన్నప్పటినుండి అంటే 30 సంవత్సరాల క్రితం నుండి ఈ మట్టి గణేష్ విగ్రహాలను చేస్తూ వచ్చారు. అప్పట్లో అంత పెద్ద ప్రజా ఆదరణ దొరక పోయినా కానీ వదలలేదు. తనకు తాను చేసుకుంటూ వచ్చారు. ఇప్పుడిప్పుడే చిదానంద విద్యను కళను ప్రజలు ప్రోత్సహిస్తున్నారు, ఆదరిస్తున్నారు.

చుట్టుపక్కల అన్ని ఊర్లలో ఆయన కల ఇప్పుడు ప్రచారాల్లోకి వచ్చి ప్రాచుర్యం పొందు తోంది. కల నచ్చడంతో ఎందరో మఠాధితులు ,సంఘ కార్యకర్తలు అవార్డు ఇవ్వడం జరిగింది.





తెలంగాణ ప్రభుత్వం వాళ్లను గుర్తించి ఐ డి కార్డ్ ను అందించింది. ఒక కళాకారునిగా నా జీవితాన్ని సార్ధకం చేసుకోవాలన్నదే నా ఆశయం అని చిదానంద తెలిపారు.తనకు గుర్తింపు లభించడం ఆనందంగా ఉందని అన్నారు.



## నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాల కూల్చివేతలు



**రామచంద్రపురం, సెప్టెంబరు 10(జనంసాక్షి):** భారతి నగర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ ఎంఐజీలో మున్సిపల్ అధికారులు కూల్చివేతల డ్రైవ్ చేపట్టారు. నిర్మాణ అనుమతులు, పట్టణ ప్రణాళిక నిబంధనలు, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకునే ప్రక్రియలో భాగంగా ఈ కూల్చివేతలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.
అమీన్‌పూర్ డీసీ ప్రదీప్ కుమార్ పర్యవేక్షణలో సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టారు. నిబంధనలకు అనుగుణంగా లేని నిర్మాణాలు, అనుమతులకు విరుద్ధంగా చేపట్టిన పనులపై పరిశీలన అనంతరం అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.
ప్రాంతంలో పరిస్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. నిర్మాణ అనుమతులు, ప్లానింగ్ నిబంధనలు, ప్రభుత్వ మార్గదర్శకాలను ఉల్లంఘించే నిర్మాణాలపై నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు సమన్వయంతో కూల్చివేతల ప్రక్రియను చేపడుతున్నారు.కాగా ఇకముందు కూడా అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేది లేదని అధికారులు హెచ్చరించారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు జరిగేలా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలి

- **జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక**





నారాయణపేట జిల్లా బ్యూరో సెప్టెంబర్ 10(జనం సాక్షి):ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు జరిగేలా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక తెలిపారు. గురువారం నారాయణపేట ప్రభుత్వ వైద్యశాలలో ఎస్పీ వినీత్ తో కలిసి సేవ భారతి పాలమూర్ ఈఎన్టి ఉచిత వినికిడి పరికరాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రిలో ఓపి ఎక్కువగా ఉందని తెలిపారు. నార్మల్ డెలివరీ లు బాగా జరుగుతున్నాయని 100% బెస్ట్ మెడికల్ కాలేజీ గా నిలబెట్ట వచ్చని తెలిపారు. రోగులను బాగా చూసు కోవాలని డాక్టర్లకు ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తామని తెలిపారు. ప్రతి మంగళవారం ఆరోగ్యం మహిళ కార్యక్రమం డిఆర్డిఏ ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు. ఎస్పీ వినీత్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డెంగ్యూ మలేరియా పై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ శాఖ వారి సహాయం ఎల్లప్పుడూ ఉంటుందని ఎస్పీ తెలిపారు. సేవా భారతీయ అధ్యక్షులు రాందేవ్ మాట్లాడుతూ 1981లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఎన్జీవో గా 3,000 మంది వాలంటీర్లు పనిచేస్తున్నారని తెలిపారు. 1990 నుండి ఉమ్మడి ఏపీ తెలంగాణలలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 300 మంది అనాథ పిల్లలకు ప్రత్యేకంగా కేంద్రాలలో నడుపుతున్నట్టు తెలిపారు. అనంతరం కలెక్టర్ ఏడు మంది అర్హులైన అభ్యర్థులకు వినికిడి పరికరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంపత్ డాక్టర్లు తదితరులు ఉన్నారు.

## తూప్రాన్‌లో నాలుగు కల్లు దుకాణాలపై తనిఖీలు

- **నిషేధిత మత్తు పదార్థం (ఆల్ఫాజోలం) గుర్తింపు**






**తూప్రాన్, సెప్టెంబర్ 10(జనంసాక్షి):** తూప్రాన్ పట్టణంలో బుధవారం రాత్రి ఈగల్ ఫోర్స్, మెదక్ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నాలుగు కల్లు దుకాణాల పై తనిఖీలు నిర్వ హించి తీసుకో మత్తు పదార్థాలు ఉండడంతో కేసులు నమోదు చేసినట్లు తూప్రాన్ ఎస్ఐ గంగరాజు తెలిపారు.
తనిఖీలలో కల్లులో నిషేధిత మత్తు పదార్థం (ఆల్ఫాజోలం )ఉన్నట్లు గుర్తించడం జరిగింది. ఈ మేరకు సంబంధిత నాలుగు కల్లు దుకాణాల్లో సేల్స్‌మెన్‌లుగా పనిచేస్తున్న కొత్తపల్లి నర్సింహారావు, మాదాసు శ్రీనివాస్ గౌడ్, పంజాల దుర్గాగౌడ్, జాలిగామ సిద్ధిరాములులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.
అలాగే సంబంధిత కల్లు దుకాణాల యజమాని రామకృష్ణ కల్లు సరఫరాదారు శ్రీనివాస్ గౌడ్పై కూడా కేసులు నమోదు చేశారు ఈ వ్యవహారంపై పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సేల్స్‌మెన్‌లుగా ఉన్న నలుగురు నిందితులను ఈరోజు కోర్టులో హాజరు పరిచారు. నిషేధిత మత్తు పదార్థం (ఆల్ఫాజోలం) కల్లులో కలపడం, అక్రమంగా సరఫరా చేయడం వంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## కోహిర్‌లో క్రీడా జోష్.. దుమ్మురేపిన విద్యార్థులు




**కోహిర్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** కోహిర్ మండలంలో 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడా పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఎంపీపీఎస్ లాలకుంట మైదానంలో ఎంఈవో మహ్మద్ జాకీర్ హుస్సేన్ క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి పోటీలను ప్రారంభించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి క్రీడలు కీలకమని, చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు.
కబడ్డీ అండర్-14లో టీఎంఆర్ఈఐఎస్ కోహిర్, అండర్-17లో గురుజ్వాడ విజేతలుగా నిలిచాయి. ఖో-ఖో అండర్-14లో కావేలి, అండర్-17లో గురుజ్వాడ జట్లు విజయం సాధించాయి. బిలాల్‌పూర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దివ్యజ్యోతి పౌష్టికాహారం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పీఈటీ సురేఖ క్రీడా ప్రమాణ స్వీకారం చేయించారు. ఉపాధ్యాయులు, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వీరనారి చాకలి ఐలమ్మకు ఘన నివాళి


బెజ్జంకిలో


బెజ్జంకిలో


సంగారెడ్డిలో


కొమురవెల్లిలో


రేగోడ్‌లో


చేర్యాలలో


చేర్యాలలో


కోహెడలో


గుమ్మడిదలలో



**సంగారెడ్డి సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా గురువారం సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ శ్రేణులు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ ప్రజలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. భూస్వామ్య, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన ఐలమ్మ ఆశయాలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఆమె త్యాగాలను స్మరించుకుంటూ ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో చింత సాయినాథ్, విజేందర్ రెడ్డి, వేణుగోపాలస్వామి, కౌన్సిలర్లు పొన్న రాజేందర్ రెడ్డి, లాడే మల్లేశం, నవీన్, నాయకులు విఠల్, కసిని శ్రీకాంత్, విష్ణువర్ధన్, మోహన్, అజీమ్, శ్రవణ్ రెడ్డి, లాడే బాలు, శరత్, రవి, సంగమేష్, ఆంజనేయులు, గురు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.


కౌడిపల్లిలో



**కొండపాక,సెప్టెంబర్ 10(జనంసాక్షి):** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో దొరల దోపిడీకీ, భూస్వామ్య పెత్తనం, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా ధైర్యంగా నైజాం దొరలను గడగడలాడించి పోరాడిన వీరనారి చిట్యాల ఐలమ్మ బాటలో ముందుకు సాగాలని సిపిఎం మండల కార్యదర్శి జిల్లా కమిటీ సభ్యులు అమ్ముల బాల్ నర్సయ్య పిలుపునిచ్చారు.చిట్యాల ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా దుద్దెడ గ్రామంలోని ఆమె విగ్రహానికి సిపిఎం,సీఐటీయు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.
ఈ సంద ర్భంగా అమ్ముల బాల్ నర్సయ్య మాట్లాడుతూ ... పేద రైతులు,వ్యవసాయ కార్మికులు, కష్టజీవులు, మహిళల ఆత్మగౌరవం కోసం ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చెరగని ముద్ర వేసిందన్నారు. భూమిపై హక్కు,శ్రమకు గౌరవం,దోపిడీకి వ్యతిరేకంగా ఆమె చూపిన తెగువ నేటి తరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో చిత్తశుద్ధితో చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.